
వీలేకరులు కావలెను
తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా వెలుబడుతున్న
ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక
తెలుగు మాసపత్రిక నందు పనిచేయుటకు
జర్నలిజంపై ఆసక్తి కలిగిన ప్రతి మండలం నుండి విలేఖరులు కావలెను
ఆసక్తి గలవారు సంప్రదించండి
+91 9381910611 , 7989289492

www.prajaswecha.com
# ప్రజా స్వేచ్ఛ
PRAJA SWECHA
రాజకీయ, సామాజిక, సంస్కృతిక, మాసపత్రిక




హైదరాబాద్ | సంచిక : 43 | సంపుటి : 2 | ఎడిటర్ : తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి | సెప్టెంబర్ 2025 | వెల : రూ



## భారత్‌ను టార్గెట్ చేయండి..

- యూరప్ దేశాలను కోరిన అమెరికా..!

వాషింగ్టన్ :-
రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడాన్ని బూచిగా చూపి అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్ పై భారీగా సుంకాల భారాన్ని మోపారు. ప్రస్తుతం భారత దిగుమతులపై అమెరికాలో 50 శాతం టారిఫ్‌లు అమలులో ఉన్నాయి. ఈ క్రమంలో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. తమలాగే భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని యూరప్ దేశాలను వైట్‌హౌస్ కోరినట్లు సమాచారం. ఈ మేరకు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి.మాస్కో నుంచి చమురు కొనుగోలు చేయడం ఆపకపోతే అమెరికా మాదిరిగానే భారత్‌పై సుంకాలను పెంచాలని ట్రంప్ యంత్రాంగం యూరప్ దేశాలను కోరినట్లు అధికార వర్గాలు తెలిపాయి. ఆంక్షలు విధించడంతోపాటు భారత్ నుంచి చమురు, గ్యాస్ కొనుగోలును నిలిపివేయాలని కోరినట్లు తెలుస్తోంది. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపే విషయంపై చర్చించేందుకు రష్యా అధ్యక్షుడు పుతిన్‌తో -మిగతా 3 లో

# కల్వకుంట్ల కాదు..
# కల్వకుండా



### బీసీ రిజర్వేషన్లపై చిలువలు, పలువలు చేయొద్దు

- 'బీసీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవద్దు
- బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం బీసీల రిజర్వేషన్లకు గుదిబండగా మారింది
- 'తాను చెడ్డ కోతి వనమల్లా చెడగొట్టినట్టు' కేసీఆర్ వ్యవహారం
- అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల పై సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్- ప్రజా స్వేచ్ఛ
కేసీఆర్‌ది కల్వకుంట్ల కాదు ఎవరినీ కల్వకుండా చేసే కుటుంబమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. అందుకే బీసీ బిల్లుకు అడ్డు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలు.. హిందువులు కలవకుండా, బీసీలు.. ఓసీలు కలవకుండా, ఎస్సీలు.. ఎస్టీలు కలవకుండా చూడటమే కల్వకుంట్ల కుటుంబ లక్ష్యమని రేవంత్ ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యుల విమర్శలపై సీఎం స్పందించారు. బీసీ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిస్తే కేంద్రం మీద ఒత్తిడి తెచ్చే అవకాశం -మిగతా 3 లో

## ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తాం



- సరిహద్దులో శాంతి, సుస్థిరత నెలకొన్నాయి
- జిన్‌పింగ్‌తో మోడీ గంటకు పైగా భేటీ
- శాంతి, అభివృద్ధికి దోహదం
- ఎస్‌సీఓ సమావేశంలో జిన్‌పింగ్

తియాంజిన్
పరస్పర విశ్వాసం, గౌరవం ఆధారంగా చైనాతో సంబంధాలను పెంచుకునేందుకు భారత్ కృతనిశ్చయంతో ఉన్నదని ప్రధాని నరేంద్ర మోడీ చెప్పారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) నేతల సదస్సుకు ముందు ఆయన ఆదివారం చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. కజన్‌లో గత సంవత్సరం జరిగిన సమావేశంలో ఫలప్రదమైన చర్చలు జరిపామని, ద్వైపాక్షిక సంబంధాలకు అవి సానుకూల దిశను అందించాయని జిన్‌పింగ్‌కు తెలిపారు. మోడీ అభిప్రాయంతో జిన్‌పింగ్ ఏకీభవించారు. 'గత సంవత్సరం కజన్‌లో విజయవంతంగా జరిగిన సమావేశం కారణంగా భారత్-చైనా సంబంధాలు పున్ణప్రారంభమయ్యాయి. -మిగతా 3 లో



## చర్చ అసెంబ్లీలో కాదు.. పార్లమెంటులో జరగాలి

- సీఎంకు దమ్ముంటే జంతర్‌మంతర్ వద్ద ఆమరణ దీక్ష చేయాలి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- విమర్శలు మాని రిజర్వేషన్లకు మద్దతివ్వండి : బీఆర్ఎస్, బీజేపీలకు మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం విజ్ఞప్తి
- అన్ని పార్టీలు కలిసి రావాలి: కూనంనేని
- బీసీ రిజర్వేషన్లపై శాసనసభలో వాడివేడి చర్చ

హైదరాబాద్ ప్రజా స్వేచ్ఛ
ఎన్ని రాజకీయ విమర్శలు చేసినా బీసీ రిజర్వేషన్ల బిల్లుకు చట్టబద్ధత రాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. శాసనసభ వర్షాకాల సమావేశాల్లో రెండోరోజైన ఆదివారం పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులను మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, సీతక్క ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చలో కేటీఆర్ మాట్లాడుతూ ఈ బిల్లు మన పరిధిలో లేదని తేల్చి చెప్పారు. 42శాతం రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ పార్టీ -మిగతా 3 లో

## కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్
# అన్నీ కేసీఆరే

### అసెంబ్లీలో కాళేశ్వరం కమిషన్ నివేదికను ప్రవేశపెట్టిన మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి

- సీడబ్ల్యూసీ అనుమతి లేకుండానే కాళేశ్వరం కట్టారు
- పీసీ ఘోష్ కమిషన్ విచారణలో తేలింది ఇదే
- రూ.1.47 లక్షల కోట్లకు పెరిగిన అంచనా
- విద్యుత్ బకాయిలు రూ.9,735 కోట్లు
- డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేదు
- సిగ్గులేకుండా కోర్టుకెళ్లారు
- సభ్యుల సూచన మేరకే చర్యలంటూ వ్యాఖ్య




హైదరాబాద్ -
కాళేశ్వరం ప్రాజెక్టుకు కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అన్నీ కేసీఆరేనని, న్యాయవిచారణ కమిషన్ తేల్చిందిదేనని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖమంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. సీఎం హెూదాలో కేసీఆర్ ఇంజినీర్‌లా వ్యవహరించి సాంకేతిక అంశాల్లో జోక్యం చేసుకున్నారని వ్యాఖ్యానించారు. కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ రిపోర్టుపై ఆదివారం స్పీకర్ బి.ప్రసాద్‌కుమార్ అసెంబ్లీలో చర్చకు అనుమతిచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన ఉత్తమ్, కాళేశ్వరం ప్రాజెక్టుకు కర్త, కర్మ, క్రియా అన్నీ కేసీఆరే, మేడిగడ్డ అయన వ్యక్తిగత నిర్ణయమన్నారు. సీడబ్ల్యూసీ అనుమతి లేకుండానే కాళేశ్వరం ప్రారంభించినట్టు కమిషన్ నివేదికలో పేర్కొంద న్నారు. "ఉద్దేశ్యపూర్వకంగానే -మిగతా 3 లో



## సెప్టెంబర్‌లో మరింత వర్షపాతం

- ఆకస్మిక వరదల ముప్పు
- ఐఎండీ అంచనా

న్యూఢిల్లీ- ప్రజా స్వేచ్ఛ
: మనదేశంలో సెప్టెంబర్ నెలలో మరింతగా వర్షపాతం నమోదవుతుందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) తెలిపింది. ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడటం లాంటి సంఘటనలు చోటుచేసుకుంటాయని హెచ్చరించింది. ఆదివారం ఏర్పాటు చేసిన ఆన్‌లైన్ మీడియా సమావేశంలో ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మోహపాత్ర మాట్లాడుతూ సెప్టెంబర్‌లో కురవనున్న భారీ వర్షాలు ఉత్తరాఖండ్‌లో కొండ చరియలు విరిగిపడటం, ఆకస్మిక వరదలకు దారితీస్తాయని చెప్పారు. దక్షిణ హర్యానా, ఢిల్లీ, ఉత్తర రాజస్థాన్‌లో -మిగతా 3 లో

## ప్రజాగ్రహానికి దిగొచ్చిన ఇండోనేషియా సర్కారు

- ఎంపీలకు ఇటీవల కల్పించిన ప్రయోజనాలు రద్దు

జకార్తా -



ఇండోనేషియా ప్రభుత్వం ప్రజాగ్రహానికి దిగొచ్చింది. పేదల సంక్షేమానికి కోత పెడుతూ.. పార్లమెంట్ సభ్యులకు అధిక జీతాలు, ఇంటి అద్దెలు పెంచడంపై దేశవ్యాప్తంగా ఆగ్రహ జ్వాలలు పెల్లుబుకుతున్నాయి. ఆదివారం ఆర్థిక మంత్రి ముల్యాని ఇంద్రావతి ఇంటిని కొందరు ఆందోళనకారులు లూటీ చేశారు. ఉద్రిక్తతల నేపథ్యంలో ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో అధ్యక్ష భవనంలో ఆదివారం మీడియా సమావేశం నిర్వహించారు. పార్లమెంట్ సభ్యులకు ఇస్తున్న జీతాలు, ఇంటి అద్దెలను తగ్గిస్తున్నామని చెప్పారు. అన్ని రాజకీయ పార్టీలతో చర్చించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. మంత్రి ఇంటిపై జరిగిన దాడిని ఖండించారు. -మిగతా 2 లో


## ఘోష్ కమిషన్ నివేదిక చిత్తుకాగితం



- ఇది కక్షసాధింపు చర్యల్లో భాగమే
- వరదల్లో కాంగ్రెస్ బురదరాజకీయం
- 8 బీ,8 సీ ప్రకారం మాకు నోటీసు ఇవ్వలేదు
- చట్టబద్ధంగా విచారణ జరగనందునే హైకోర్టుకెళ్లాం
- స్టే రావొద్దనే ప్రభుత్వం సుప్రీంలో కేవియట్ దాఖలు
- ఆర్థిక అవకతవకలు ఒట్టిమాటే : అసెంబ్లీలో మాజీ మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్ -
పీసీ ఘోష్ కమిషన్ నివేదిక డొల్ల అనీ, ఒక చిత్తు కాగితమని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే టి హరీశ్‌రావు విమర్శించారు. రాజకీయ కక్షసాధింపు చర్యల్లో భాగంగానే ఈ నివేదిను రూపొందించారని అన్నారు. ఆదివారం అసెంబ్లీలో కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ నివేదికపై జరిగిన చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. భారీ వర్షాలు, వరదలతో ప్రజలు అనేక బాధలు పడుతున్నారని అన్నారు. ఈ సమయం లో కాంగ్రెస్ ప్రభుత్వం బురద రాజకీయం చేస్తున్నదని -మిగతా 3 లో

## శ్రీశైలం 10 గేట్లు ఎత్తివేత



- ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతోజలకళ
- 2,16,520 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల

మహబూబ్‌నగర్ ప్రజా స్వేచ్ఛ
ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న వర్షాలతో తెలుగు రాష్ట్రాల ప్రాజెక్టుకు భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో జలకళను సంతరించుకుంటు న్నాయి. ఈ నేపథ్యంలో శ్రీశైలం ప్రాజెక్టుకు ఆదివారం ఒక్కసారిగా వరద ప్రవాహం పెరిగింది. దాంతో ప్రాజెక్టు 10 గేట్లు ఎత్తి 2,16,520 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. ఇన్‌ఫ్లో 3.40 లక్షల క్యూసెక్కులు కాగా ఔట్ ఫ్లో 3.12 లక్షల క్యూసెక్కులుగా ఉంది. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి 30 వేల క్యూసెక్కులు, -మిగతా 3 లో

# బీహార్ ఓటర్ల జాబితాలో మళ్లీ చేర్చండి

**33 వేల మందికి పైగా దరఖాస్తు**
**ఆర్టీఐ ప్రశ్నలకు సమాధానమివ్వని ఈసీఐ**



**పాట్నా ప్రజా స్వేచ్ఛ**
బీహార్‌లో కొనసాగుతున్న ఎన్నికల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్)లో క్లెయిమ్ లు, అభ్యంతరాలను దాఖలు చేయడానికి కేవలం ఒక రోజు మాత్రమే మిగిలి ఉన్నది. భారత ఎన్నికల కమిషన్ (ఈసీ) ఆదివారం (ఆగస్టు 31, 2025) 33,326 మంది ఓటర్ల జాబితాలో తిరిగి చేర్చడానికి దరఖాస్తు చేసుకున్నారని తెలిపింది. ఆగస్టు 1న ప్రచురించబడిన ముసాయిదా ఓటర్ల జాబితాలో 7.24 కోట్ల మంది ఉన్నారు, సర్ ప్రక్రియ ప్రారంభానికి ముందు ప్రచురిం చిన ఓటర్ల జాబితా నుంచి 65 లక్షల పేర్లు తీసివేసింది. ఈసీ చర్యపై ప్రతిపక్షాలు, ప్రజలు, సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. అనంతరం ఓటర్ల జాబితాలో చేర్చాలని 33,326 మంది దరఖాస్తులు దాఖలు చేశారని, ఇటీవల 18 ఏండ్లు నిండి ఓటు వేయడానికి అర్హత సాధించిన కొత్త ఓటర్ల సంఖ్య పెరిగింది. 15,32,438 దరఖాస్తులు వచ్చాయని ఎన్నికల సంఘం ఒక అధికారిక ప్రకటనలో తెలిపింది. ముసాయిదా ఓటర్ల జాబితాలో చేర్చబడిన పేర్లను సవాలు చేస్తూ 2,07,565 అభ్యంతరాలు దాఖలయ్యాయి.సోమవారం (సెప్టెంబర్ 1, 2025), ముసాయిదా జాబితాపై వాదనలు , అభ్యంతరాలను దాఖలు చేయడానికి గడువును పొడిగించాలని కోరుతూ రాష్ట్రీయ జనతాదళ్(ఆర్జేడీ), ఇతరులు దాఖలు చేసిన పిటిషన్లను సుప్రీంకోర్టు విచారించనుంది.

**ఆర్టీఐ ప్రశ్నలకు సమాధానం లేదు..**
సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద అడిగిన ప్రశ్నలకు ప్రతిస్పందనగా,సర్ ప్రక్రియ ఆధారంగా నిర్వహించాలనే నిర్ణయం ఆధారంగా లేదా 2003లో చివరిగా ఇంటెన్సివ్ ఓటర్ల జాబితా సవరణ కోసం ఆర్డర్ కాపీని ఇవ్వటానికి ఈసీ నిరాకరించింది. పారదర్శకత కార్యకర్త అంజలి భరద్వాజ్ ఎన్నికల కమిషన్‌కు రెండు వేర్వేరు ఆర్టీఐలను దాఖలు చేశారు. మొదటి ఆర్టీఐలో.. కార్యకర్త 2025లో దేశవ్యాప్తంగా సర్‌ను ప్రారంభించాలని ఈసీ నిర్ణయించిన ఏదైనా స్వతంత్ర మదింపు లేదా అధ్యయనం లేదా విశ్లేషణ ఇవ్వాలని కోరారు. అలాగే సర్‌తో సంబంధం ఉన్న అన్ని ఫైళ్ల కాపీలను అందజే యాలని దరఖాస్తులో పేర్కొన్నారు. దాని ప్రతిస్పందనగా.. జూన్ 24 నాటి ఈసీ మార్గదర్శకాన్ని సూచించమని భరద్వాజ్‌ను కోరింది, ఇది లింక్‌ను అంది స్తూ దాని వెబ్‌సైట్‌లో "స్వీయ వివరణాత్మకమైనది . అందుబాటులో ఉంది" అని పేర్కొంది. "ఇంకా, కమిషన్‌లో ఎటువంటి (ఎస్ఐసీ) సమాచారం అందు బాటులో లేదు" అని అది పేర్కొంది.రెండవ ఆర్టీఐ దరఖాస్తులో.. 2003లో బీహార్‌లో ఓటర్ల జాబితాల ఇంటెన్సివ్ రివిజన్ నిర్వహించిన ఆర్డర్ లేదా నోటిఫికేషన్ కాపీని కోరారు. 2003లో ఆ ఇంటెన్సివ్ రివిజన్ కోసం జారీ చేసిన మార్గదర్శకాల కాపీని కూడా ఆమె కోరారు.కానీ ఈసీ నిరాకరించింది. జూన్ 24 నాటి ఆర్డర్‌కు లింక్‌ను మళ్ళీ అందించింది.కేంద్రఎన్నికల సంఘం వ్యవహరించినతీరు బీహార్ ఎన్నికలు ఎంత వరకు పారదర్శకంగా జరుగుతాయన్న అనుమానాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.


# 7,000కు పైగా పెండింగ్‌లో ఉన్న అవినీతి కేసులు



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సిబిఐ) దర్యాప్తు చేసిన 7,072 అవినీతి కేసులు వివిధ కోర్టులలో విచారణ పెండింగ్‌లో ఉన్నాయని సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సివిసి) తెలిపింది. వాటిలో 379 కేసులు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని ఆదివారం విడుదలైన తాజా వార్షిక నివేదిక పేర్కొంది. 2024, డిసెంబర్ 31 నాటికి మొత్తం కేసుల్లో 1,506 కేసులు మూడేళ్ల లోపు, 791 కేసులు మూడేళ్ల నుండి ఐదేళ్ల వరకు, 2,115 కేసులు ఐదేళ్ల నుండి 10 ఏళ్ల వరకు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. అవినీతి నిరోధక సంస్థ ఇటీవల విడుదల చేసిన నివేదిక ప్రకారం.. మొత్తం 2,281 కేసులు 10ఏళ్లకు పైగా మరియు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని, 379 కేసులు 20 ఏళ్లకు పైగా విచారణలో ఉన్నాయని తెలిపింది. 2024 డిసెంబర్ 31 నాటికి 7,072 కేసులు విచారణ కోసం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. వాటిలో 2,660 కేసులు 10 ఏళ్లకు పైగా పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగించే విషయమని సివిసి పేర్కొంది. నివేదిక ప్రకారం.. సిబిఐ మరియు నిందితులు దాఖలు చేసిన 13,100 అప్పీళ్ళు/సవరణలు వివిధ హైకోర్టులు మరియు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని సివిసి తెలిపింది. వీటిలో 606 అప్పీళ్లు/ సవరణలు 20 సంవత్సరాలకు పైగా, 1,227 అప్పీళ్లు/సవరణలు 15 ఏళ్లకు పైగా 20 ఏళ్లకంటే తక్కువ కాలం, 2,989 10 సంవత్సరాల కంటే తక్కువ కాలం, 4,059 ఐదేళ్ల కంటే ఎక్కువ 10 ఏళ్ల కంటే తక్కువ కాలం, 1,778 రెండేళ్ల కంటే ఎక్కువ ఐదేళ్ల కంటే తక్కువ కాలం మరియు 2,441 రెండేళ్ల కంటే తక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. '2024లో 644 కేసుల్లో తీర్పులు వెలువడ్డాయి. వీటిలో 392 మందికి శిక్ష పడింది. 154మంది విడుదలయ్యారు. 21మంది డిశ్చార్జ్ అయ్యారు. 77 మంది ఇతర కారణాల వలన తొలగించబడ్డారు. " అని సివిసి తెలిపింది. 2023లో నేరాలకు శిక్షలు పడిన రేటు 71.47శాతంగా ఉండగా, గత ఏడాది 69.14శాతానికి పడిపోయింది. 2024 చివరి నాటికి, అవినీతితో సంబంధం లేని కేసులు సహా మొత్తం 11,384 కేసులు వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. 2024లో సిబిఐ 807 కేసులు నమోదు చేసిందని, వాటిలో 674 సాధారణ కేసులు మరియు 133 ప్రాథమిక విచారణలు ఉన్నాయని సివిసి నివేదిక తెలిపింది.

# మూడు రోజుల క్రితం మహిళ మిస్సింగ్..

**–నదిలో దొరికిన మృతదేహం..!**



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
మూడు రోజుల క్రితం కనిపించకుండా పోయిన బెంగళూరు మహిళ మరణించింది. ఆదివారం సౌపర్ణిక నది లో ఆమె మృతదేహం దొరికింది. ఉడుపి జిల్లా కొల్లూరు లోని మూకాంబిక ఆలయం వద్ద బెంగళూరుకు చెందిన మహిళ కనిపించకుండా పోయింది. కొల్లూరు మీదుగా ప్రవహించే సౌపర్ణిక నదిలో ఆదివారం ఆమె మృతదేహం లభ్యమైంది.వివరాల్లోకి వెళ్తే.. బెంగళూరుకు చెందిన వసుధ చక్రవర్తి (45) బెంగళూరు త్యాగరాజనగరలోని సీఆర్ గోవిందరాజులు కుమార్తె. ఆమె తరచూ కొల్లూరులోని మూకాంబిక ఆలయానికి వెళ్లి దేవి దర్శనం చేసుకుని వెళ్లేవారు. ఎప్పటిలాగే ఆగస్టు 28న కూడా ఆమె సొంత కారులో బెంగళూరు నుంచి కొల్లూరుకు వచ్చారు. ఓ లాడ్జిలో బస చేశారు. మరుసటి రోజున తల్లిదండ్రులు ఆమెకు కాల్ చేయగా స్పందన లేదు. దాంతో వారు హుటాహుటిన కొల్లూరుకు వచ్చి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు పలుచోట్ల సీసీ కెమెరాలను పరిశీలించారు. స్థానికులను విచారించారు. ఆ రోజు ఆమె చాలా టెన్షన్‌గా కనిపించారని, ఒంటరిగా, వేగంగా వెళ్తూ ఉండగా చూశామని కొందరు చెప్పారు. ఆమె సమీపంలోని సౌపర్ణిక నదివైపు వెళ్లారని, నదిలోకి దూకారని, ప్రవాహంతోపాటు కొట్టుకుపోయారని మరి కొందరు తెలిపారు. దాంతో స్థానిక పోలీసులు, ఫైర్ సిబ్బంది గజ ఈతగాళ్ల సాయంతో నదిలో ఆమె కోసం గాలించారు. చివరికి ఆదివారం నాడు నదిలో ఆమె మృతదేహం దొరికింది. దాంతో పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. ఆమె మరణానికిగల కారణాలు తెలియాల్సి ఉందని అన్నారు. ఇది హత్యనా, ఆమె హత్యానా అనే కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# డ్రాగన్, ఏనుగు కలిసి ఆడాలి..

**ప్రధాని మోదీతో ద్వైపాక్షిక భేటీలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్**



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
షాంఘై సహకార సంస్థ వార్షిక సదస్సు కోసం భారత ప్రధాని నరేంద్ర మోదీ చైనాలో పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ తో ప్రధాని భేటీ అయ్యారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ మాట్లాడుతూ.. భారత్–చైనా దేశాలు స్నేహంగా ఉండటం సరైన నిర్ణయమని అన్నారు.ప్రధాని మోదీని మరోసారి కలవడం తనకు ఎంతో ఆనందంగా ఉందని జిన్‌పింగ్ చెప్పారు. గత ఏడాది కజన్‌లో ఇరువురి నేతల మధ్య జరిగిన భేటీని ఆయన గుర్తు చేసుకున్నారు. ప్రపంచంలోనే అత్యధిక జనాభా కలిగిన రెండు దేశాలు.. గ్లోబల్ సౌత్‌లో ముఖ్యమైన సభ్యులని అన్నారు. ఇరు దేశాల్లోని ప్రజల శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని సంబంధాల పునరుద్ధరణ బాధ్యతను తాము భుజాన వేసుకున్నామని చెప్పారు. పొరుగు దేశాలుగా తమ మధ్య స్నేహపూర్వక సంబంధాలు కొనసాగాలని ఆకాంక్షించారు. ఇరు దేశాల విజయాలకు దోహదపడే అంశాల్లో డ్రాగన్, ఏనుగు కలిసి రావడం సరైన ఎంపిక అన్నారు. ఈ సందర్భంగా ద్వైపాక్షికంగా స్థిర, దృఢమైన సంబంధాలు దీర్ఘకాలం కొనసాగేలా చూసుకోవాలని పేర్కొన్నారు. ప్రపంచంలో శాంతి, శ్రేయస్సు కోసం భారత్–చైనాలు బాధ్యత తీసుకోవాలని జిన్‌పింగ్ పిలుపునిచ్చారు.

# ఉగ్రవాదంపై పోరులో భారత్‌కు చైనా మద్దతు..

**వాణిజ్యంపైనా చర్చలు..!**



**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
షాంఘై కో–ఆపరేషన్ సమావేశం లో భారత ప్రధాని నరేంద్ర మోడీ దౌత్యం ఫలిస్తోంది. ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి చైనా మద్దతు తెలిపింది. అన్నివిధాలుగా తాము సహకరిస్తామని ఆ దేశ అధ్యక్షుడు జిన్‌పింగ్ ప్రధాని నరేంద్ర మోడీ కి మాటిచ్చారు. ఈ విషయాన్ని ఆదివారం భారత విదేశాంగ శాఖ వెల్లడించింది. అంతేకాదు రష్యా నుంచి ముడి చమురు కొనడంపై అమెరికా సుంకాలు, ఆంక్షలు విధించిన నేపథ్యంలో ఇరుదేశాల మధ్య వాణిజ్య సంబంధాలను బలోపేతం చేసుకోవాలని మోడీ, జిన్‌పింగ్ భావించారు. సరిహద్దులో శాంతియుత వాతావరణం ఏర్పడే దిశగా కృషి చేసేందుకు ఇరువురు అంగీకరించారు.ప్రధాని నరేంద్ర మోడీ లేవనెత్తిన ఉగ్రవాదం అంశంపై చర్చ జరిగింది. సీమాంతర ఉగ్రవాదాన్ని తిప్పికొట్టేందకు మనదేశం తీసుకుంటున్న చర్యలను ప్రధాని చాలా క్లుప్తంగా, స్పష్టంగా జిన్‌పింగ్‌కు వివరించారు. టెర్రిరిజం బాధిత దేశాల్లో భారత్, చైనా ఉన్నాయి అని పేర్కొన్న మోడీ చైనా అధ్యక్షుడి మద్దతు కోరారు. అందుకు ఆయన అంగీకరించారు అని మీడియాకు భారత విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు.

# విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే తిరిగి ఢిల్లీకి..!




**న్యూఢిల్లీ ప్రజా స్వేచ్ఛ**
ఇండోర్‌కు వెళ్లాల్సిన ఎయిర్ ఇండియా విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. విమానపు కుడి ఇంజిన్‌లో అగ్నిప్రమాద సూచన అందుకున్న దరిమిలా పైలట్ విమానాన్ని ఢిల్లీకి మళ్లించినట్లు ఎయిర్ ఇండియా తెలిపింది. ఢిల్లికి తిరిగి వచ్చిన విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశామని, ప్రయాణికులను ఇండోర్‌కు ప్రత్యామ్నాయ విమానంలో తరలించామని ఎయిర్ ఇండియా అధికారులు తెలిపారు. 'ఆగస్టు 31న ఢిల్లీ నుండి ఇండోర్‌కు బయలుదేరిన విమానం టేకాఫ్ అయిన కొద్దిసేపటికే ఢిల్లీకి తిరిగి వచ్చింది. కాక్‌పిట్ సిబ్బందికి ఇంజిన్‌లో మంటలు వస్తున్నట్లు సూచన అందింది. ప్రామాణిక విధానాన్ని అనుసరించి.. కాక్‌పిట్ సిబ్బంది ఇంజిన్‌ను ఆపివేయాలని నిర్ణయించుకుని, ఢిల్లీకి తిరిగి వచ్చారు. ఢిల్లీలో విమానం సురక్షితంగా ల్యాండ్ అయ్యింది. విమానాన్ని తనిఖీల కోసం నిలిపివేశారు. ప్రయాణికులను ప్రత్యామ్నాయ విమానంలోకి తరలిస్తున్నారు. 'ప్రయాణికులకు కలిగిన అసౌకర్యానికి మేము చింతిస్తున్నాం. ప్రయాణికులు, సిబ్బంది భద్రతే మా ప్రధాన ప్రాధాన్యత' అని ఎయిర్‌లైన్ ప్రతినిధి తెలిపారు

# నీ బ్యాటింగ్ టెస్ట్ క్రికెట్‌కు అందం

**న్యూఢిల్లీ:ప్రజా స్వేచ్ఛ**



టెస్ట్ క్రికెట్ సొబగు చటేశ్వర్ పుజార బ్యాటింగ్‌తో మరింత గుభాళించిందని ప్రధాని మోదీ కొనియాడారు. అతడి బ్యాటింగ్ శైలి సుదీర్ఘ ఫార్మాట్ అందానికి అద్దం పడుతుందని ప్రశంసించారు. ఇటీవల టెస్ట్ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన సౌరాష్ట్ర ఆటగాడికి ప్రధాని లేఖ రాశారు. 'పొట్టి క్రికెట్ ఆధిపత్యం చెలాయిస్తున్న కాలంలో..సుదీర్ఘ ఫార్మాట్ ఆట అందం ఎలా ఉంటుందో చెప్పేందుకు నువ్వే తార్కాణం. వెన్ను చూపని నీ తత్త్వం, గొప్ప సంకల్పంతో గంటలకొద్దీ బ్యాటింగ్ చేయగల సామర్థ్యంతో భారత బ్యాటింగ్‌కు అండగా నిలిచావు' అని ఆ లేఖలో ప్రధాని పొగిడారు. ఈమేరకు మోదీ పంపిన లేఖను పుజార ఆదివారంనాడు సోషల్‌మీడియాలో పోస్ట్ చేశాడు.

# యమగూచికి టైటిల్

**ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్స్**

**పారిస్ (ఫ్రాన్స్)ప్రజా స్వేచ్ఛ**
2021, 2022లో ప్రపంచ చాంపియన్‌గా నిలిచిన జపాన్ షట్లర్ అకానె యమగూచి 2025 వరల్డ్ టైటిల్‌తో ముచ్చటగా మూడోసారి చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో చెన్ యుఫెరు (చైనా)పై 21-9, 21-13తో యయగూచి ఏకపక్ష విజయం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్‌లో మలేషియా జోడీ చెన్, వీ విజేతలుగా నిలిచారు.

# కల్వకుంట్ల కాదు.. కల్వకుండా

(మొదటి తరువాయి)

ఉంటుందన్నారు. బిల్లుపై చర్చకు ప్రతిపక్ష నేత హెూదాలో కేసీఆర్ వచ్చి ఉంటే ఆయన పెద్దరికం నిలిచేదని చెప్పారు. 'తాను చెడ్డ కోతి వనమల్లా చెడగొట్టినట్టు' కేసీఆర్ వ్యవహారం ఉందన్నారు. కేసీఆర్ ఒత్తిడికి లొంగకుండా బిల్లుకు మద్దతు తెలపాలని గంగుల కమలాకర్‌ను కోరారు. రాజకీయ వివాదాలకు తావివ్వకుండా, ఆరోపణలు చేయకుండా మంచి ఉద్దేశంతో తెచ్చిన బిల్లుకు మద్దతివ్వాలని కోరారు. 'బీసీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవద్దు. ఈ ఒక్క విషయంలోనన్నా కేసిఆర్ ఒత్తిడికి లొంగొద్దు. నువ్వేం వాళ్లకు భయపడకు మిత్రమా. మనం పాత మిత్రులమే కదా. నీకు తెల్వంది ఏముంది. వాళ్లకు ఇష్టం లేదు. వాళ్ల పోకడలు ఎట్లుంటయో నీకు తెల్వదా. నేను చెప్పాల్నా. నాకు వాళ్ల గురించి చానా తెలుసు.. కాబట్టే కర్రు కాల్చి వాత పెట్టి ఇక్కడొచ్చి కూర్చున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం బీసీల రిజర్వేషన్లకు గుదిబండగా మారిందని విమర్శించారు. ఆ అడ్డంకులను తొలగించేందుకు ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. బీఆర్ఎస్ తెర వెనుక ఉండి దాన్ని ఆమోదం పొందకుండా కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ ఐదుసార్లు ప్రధాని మోడీకి లేఖ రాసినా ఆయన స్పందించలేదన్నారు. అందుకే బీసీ రిజర్వేషన్లపై తాము ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తే వివిధ పార్టీలకు చెందిన 100 మంది ఎంపీలు మద్దతు ఇచ్చారు కానీ రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. కడుపులో కావాల్సినంత విషం పెట్టుకుని బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

# భారత్‌ను టార్గెట్ చేయండి..

(మొదటి తరువాయి)

ఇటీవల ట్రంప్ భేటీ అయ్యారు. యుద్ధం ముగించేందుకు అగ్రరాజ్యాధిపతి తీసుకుంటున్న చర్యలకు కొంతమంది యూరోపియన్ నాయకులు మద్దతు పలికినట్లు సమాచారం. అయితే భారత్‌కు వ్యతిరేకంగా ట్రంప్ తీసుకున్న కఠిన నిర్ణయాలపై యూరోపియన్ దేశాలు మౌనంగా ఉన్నాయి. సుంకాలు విధించడాన్ని సమర్థించలేదు. అలా అని తప్పుబట్టలేదు. ఈ క్రమంలో భారత్‌ను లక్ష్యంగా చేసుకోవాలని ట్రంప్ పరిపాలనాధికారులు కోరడం గమనించాల్సిన విషయం.

## ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేస్తాం

(మొదటి తరువాయి)

రెండు దేశాల మధ్య అభిప్రాయాల మార్పిడి, సహకారం కొనసాగుతున్నాయి' అని ఆయన చెప్పారు. గత సంవత్సరం అక్టోబర్ 23న కజన్‌లో జరిగిన బ్రిక్స్ నేతల సదస్సు సందర్భంగా ఇరువురు నాయకులు భేటీ అయిన విషయం తెలిసిందే. భారత జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ మధ్య గత సంవత్సరం డిసెంబరులో జరిగిన సమావేశాన్ని మోడీ ప్రస్తావించారు. సరిహద్దు నిర్వహణపై రెండు దేశాల ప్రత్యేక ప్రతినిధులు ఒక ఒప్పందానికి వచ్చారని చెప్పారు. సరిహద్దులో నిస్సైనికీకరణ జరిగిన తర్వాత ఇప్పుడు శాంతి, సుస్థిరత నెలకొన్నదని తెలిపారు. ద్వైపాక్షిక సంబంధాలను స్థిరంగా ఉంచేందుకు తీసుకున్న రెండు ముఖ్యమైన చర్యలను మోడీ వివరించారు. 'కైలాస్ మానస సరోవర్ యాత్ర తిరిగి ప్రారంభమైంది. రెండు దేశాల మధ్య నేరుగా విమాన సర్వీసులు కూడా నడుస్తున్నాయి' అని అన్నారు. విమాన సర్వీసులను తిరిగి ప్రారంభించడంపై ఆయన ప్రకటన చేయడం ఇదే మొదటిసారి. 'మన సహకారం రెండు దేశాలకూ చెందిన 2.8 బిలియన్ల ప్రజల ప్రయోజనాలతో ముడిపడి ఉంది. మానవాళి సంక్షేమానికి కూడా ఇది దోహదపడుతుంది. ద్వైపాక్షిక సంబంధాలను ముందుకు తీసుకుపోవడానికి మేము కట్టుబడి ఉన్నాం' అని ప్రధాని చెప్పారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్, విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రి, చైనా విదేశాంగ మంత్రి వాంగ్ ఈ కూడా చర్చల్లో భాగస్వాములయ్యారు. ఉగ్రవాదం ప్రపంచ దేశాలకు ముప్పుగా పరిణమించిందని, దానిపై కలసికట్టుగా పోరాడాలని మోడీ సూచించారు. సమావేశం వివరాలను సామాజిక మాధ్యమం ఎక్స్‌లో మోడీ తెలియజేశారు. సరిహద్దులో శాంతి, ప్రశాంత వాతావరణాన్ని నెలకొల్పేందుకు రెండు దేశాలు అంగీకరించాయని చెప్పారు. ద్వైపాక్షిక, ప్రాంతీయ, అంతర్జాతీయ అంశాలపై అవగాహనను పెంచుకోవాల్సిన అవసరం ఉన్నదని ఇరువురు నేతలు అభిప్రాయపడ్డారని విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. వచ్చే సంవత్సరం భారత్‌లో జరిగే బ్రిక్స్ సదస్సుకు హాజరు కావాల్సిందిగా జిన్‌పింగ్‌ను మోడీ ఆహ్వానించారు.

## సెప్టెంబర్‌లో మరింత వర్షపాతం

(మొదటి తరువాయి)

సాధారణ జీవితానికి అంతరాయం కలిగించే అవకాశం ఉందని హెచ్చరించారు. ఉత్తరాఖండ్‌లో చాలా నదులు ఆవిర్భవించాయని, భారీ వర్షపాతం వల్ల వాటికి సంభవించే వరదలు దిగువున్న ఉన్న నగరాలు, పట్టణాలను ప్రభావితం చేస్తాయని చెప్పారు.

వాయువ్య భారతంలో

**2001 తరువాత ఆగస్టులోనే అత్యధిక వర్షపాతం**

వాయువ్య భారతదేశంలో ఆగస్టులో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 2001 తర్వాత ఈ నెలలో ఇదే అత్యధికమని ఐఎండీ తెలిపింది. 1901 తర్వాత 13వ అత్యధిక వర్షపాతమని పేర్కొంది. వర్షాకాలంలో మూడు నెలల్లో ఇప్పటి వరకు ఈ ప్రాంతంలో సాధారణం కంటే అధిక వర్షపాతం నమోదైందని తెలిపింది. జూన్ 1 నుంచి ఆగస్టు 31 మధ్య వాయువ్య భారత్‌లో మొత్తం 614.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవగా, ఇది సాధారణం 484.9 మి.మీ కన్నా సుమారు 27శాతం అధికం. తీవ్రమైన వాతా వరణ పరిస్థి తుల కారణంగానే అధిక వర్షాలు కురిసినట్టు ఐఎండీ పేర్కొంది.

పంజాబ్‌లో దశాబ్ద కాలంగా ఎప్పుడు లేనంతగా వరదలు ముంచెత్తాయి. వేల హెక్టార్ల వ్యవసాయ భూమి నీట మునిగింది. లక్షలాది మంది నిరాశ్రయు లయ్యారు. హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ములలో క్లౌడ్‌బరెస్ట్‌లు సంభవించాయి.

# చర్చ అసెంబ్లీలో కాదు.. పార్లమెంటులో జరగాలి

(మొదటి తరువాయి)

ఇరుక్కుపోయిందనీ, అందుకే తమ పరిధిలో లేని అంశంపై చట్టం తీసుకువచ్చి బీసీలను మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఎంతమంది ఉంటే అంత ప్రాతినిధ్యం ఉండాలని రాహుల్ గాంధీ చెబుతున్నారనీ, అలాంటప్పుడు 42 శాతం రిజర్వేషన్ల అంశాలపై పార్లమెంట్‌లో ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. మార్చిలో బిల్లు పాస్ చేసిందానికి, ప్రస్తుత బిల్లుకు తేడా ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు.

అప్పుడు చేయని రాష్ట్రపతి, గవర్నర్ ఇప్పుడు సంతకాలు ఎలా చేస్తారని నిలదీశారు. ప్రభుత్వాలు చేసిన చట్టాలు లొసుగులు లేకుండా చేసుకుంటే మంచిదని సూచించారు. కేవలం బీసీ డిక్లరేషన్లు ఇచ్చి వదిలేస్తే సరిపోదనీ, డెడికేషన్ ఉండాలన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే డిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేయాలని డిమాండ్ చేశారు. బిల్లుకు సంబంధించి ఢిల్లీలో ప్రధానమంత్రి దగ్గర అఖిలపక్షానికి సమయం తీసుకోవాలనీ, తాము కూడా మద్దతిస్తామని స్పష్టం చేశారు. ఢిల్లీలో చెప్పులు ఎత్తుకొని పోతారని రేవంత్ అంటున్నారనీ, ఇలా మాట్లాడిన తర్వాత ఎవరు అపాయిమెంట్ ఇస్తారని ప్రశ్నించారు. బీసీల రిజర్వేషన్లు తెలంగాణలో ఆమోదం పొందకముందే ఇక్కడి ప్రజల సొమ్ముతో బీహార్లో ముఖ్యమంత్రి తన ఫొటోలతో పత్రిక ప్రకటనలు ఇచ్చుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా సీఎం మాట తీరు మార్చుకోవాలని సూచించారు. విధానపరంగా ఎన్ని విభేదాలున్నా తమ పార్టీ మొదటి నుంచి బీసీలకు పెద్దపీట వేసిందని గుర్తు చేశారు. బీసీ బిల్లుకు సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నట్టు కేటీఆర్ ప్రకటించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చేందుకు ప్రవేశపెట్టిన సవరణ బిల్లుకు బీజేపీ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్టు ఆ పార్టీ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తెలిపారు. కామారెడ్డిలో కాంగ్రెస్ ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌పై సభలో చర్చ జరగాలని లయన డిమాండ్ చేశారు.

**ద్వంద్వ విధానాలు వీడండి: కూనంనేని**

ద్వంద్వ విధానాలు వీడి బీసీ రిజర్వేషన్ల పోరాటంలో కలిసి రావాలని బీఆర్ఎస్, బీజేపీలకు సీపీఐ శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు విజ్ఞప్తి చేశారు. ఒకవైపు బీసీ బిల్లుకు సంపూర్ణ మద్దతిస్తున్నామని చెబుతూనే 9వ షెడ్యూల్‌లో చేర్చకపోతే బిల్లుకు చట్టబద్ధత రాదని అంటున్నారని విమర్శించారు. ఈ రకంగా రెండు పార్టీలు పూటకో మాట మాట్లాడుతున్నాయని ఎద్దేవా చేశారు. బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించాలని చేసే పోరాటానికి బీజేపీ, బీఆర్ఎస్ నేతలు ఎందుకు మద్దతు పలకడం లేదని ప్రశ్నించారు. సభలో జరుగుతున్న చర్చ చూస్తుంటే తెరమీద సినిమాలు గుర్తొస్తున్నాయని విమర్శించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడమనేది విప్లవాత్మకమైన ముందడుగని కూనంనేని అన్నారు. ఈ పోరాటంలో అన్ని పార్టీలు కలిసి రావాలని కోరారు

**రాజకీయాలు పక్కన పెట్టండి: మంత్రులు శ్రీధర్‌బాబు, పొన్నం**

రాజకీయాలు పక్కన పెట్టి బీసీ రిజర్వేషన్ల బిల్లుకు మద్దతివ్వాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, సీతక్క అన్ని పార్టీలకు విజ్ఞప్తి చేశారు. పురపాలక, పంచాయతీరాజ్ చట్ట సవరణ బిల్లులపై జరిగిన చర్చ సందర్భంగా వివిధ పార్టీలు లేవనెత్తిన అంశాలపై వారు వివరణ ఇచ్చారు. వెనుకబడిన తరగతులకు ఎలాగైనా 42 శాతం రిజర్వేషన్లు సాధించి తీరుతామని వారు స్పష్టం చేశారు. గత ప్రభుత్వ నిర్ణయాలతో బీసీలకు అన్యాయం జరిగిందని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ మేరకు వాటిని సరి చేసేందుకు ఇంటింటి సమగ్ర కుటుంబ సర్వేను శాస్త్రీయంగా చేపట్టామని తెలిపారు. బీసీ మేధావుల సలహాలు, సూచనల మేరకు కులగణన విజయవంతంగా నిర్వహించామన్నారు. దీనిపై డెడికేట్ కమిషన్ ఏర్పాటు చేసి బీసీల వెనబాటుతనం, ప్రాతినిధ్యం ఆధారంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని సిఫార్సు చేసినట్టు వారు వెల్లడించారు.

# కథ, స్క్రీన్‌ప్లే, డైరెక్షన్ అన్నీ కేసీఆరే

(మొదటి తరువాయి)

కాళేశ్వరం నిర్మించారని కమిషన్ నివేదిక ఇచ్చింది. మూడు ప్రాజెక్టుల్లో సరైన నిర్వహణ లేదు. నిర్లక్ష్యంగా, అక్రమంగా, అసంబద్ధంగా ప్రాజెక్టు కట్టారని కమిషన్ చెప్పింది. ప్లానింగ్, డిజైన్లలోనే కాదు, నిర్వహణలోనూ విఫలమైంది. తీవ్రమైన లోపాలు న్నాయి. కేసీఆర్ నియమించిన రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ ఇచ్చిన నివేదికను సైతం బేఖాతరు చేశారు. తొందరపాటు ఆమో దాలతో ప్రాజెక్టుకు నష్టాలు తెచ్చారు. కేసీఆర్ చెప్పినట్టే చేశామని అధికారులు వాం గ్మూలం ఇచ్చారు. నిబంధనల ను ఉల్లంఘించి కాంట్రాక్టర్లకు మేలు చేశారు. అనుమతులు రాకుండానే పనులు అప్పగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం కక్షసాధింపు చర్య లకు పాల్పడట్లేదు. ప్రాజెక్టుల్లో రాజకీయ జోక్యం, నిర్లక్ష్యం ఉంది. మార్గదర్శకాలకు విరుద్ధంగా నిర్మాణాలకు బడ్జెట్ విడు దల చేశారు. ప్రాజెక్టు అంచనా వ్యయం పెంచి ప్రజాధనాన్ని దుర్వినియోగం చేశారు. కాళే శ్వరం ప్రాజెక్టుకు పెరిగిన ఖర్చు వల్ల రాష్ట్ర ప్రభు త్వానికి ఆర్థికంగా భారీ నష్టం జరిగింద'న్నారు. రూ. 38,400 కోట్లతో ప్రాణహితను చేపడితే, కాళేశ్వ రాన్ని రూ.1.47 లక్షల కోట్లకు పెంచారని చెప్పారు. బీఆర్ఎస్ హ యాంలోనే రాష్ట్రానికి పూర్తి నష్టం జరిగిందన్నారు. కాళే శ్వరం అక్రమాలకు పూర్తిబాధ్యత కేసీఆర్‌దేనని కమిషన్ తేల్చింద న్నారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని కమిషన్ సూచిం చిందని వెల్లడించారు. కేసీఆర్‌పై చట్ట ప్రకారం తగిన చర్య తీసుకునే స్వేచ్ఛ సర్కార్‌కు ఉందని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెప్పారు.

**తేడా లేదు**


డ్యామ్‌కు, బ్యారేజీకి తేడా లేకుండా ప్రాజెక్టు పనులు చేశారని ఎన్‌డీఎస్ఏ నివేదికలో ఉందని మంత్రి విమర్శించారు. మేడిగడ్డలో పూర్తి నీరు నిల్వ చేసి కూలి పోయేందుకు కారణమ య్యారన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత రూ. 87,449 కోట్లతో చేపట్టిన అతిపెద్ద ప్రాజెక్టు కాళేశ్వరంతో పాటు మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిరుపయోగంగా మారాయని, ప్రాణహిత- చేవెళ్లను పక్కకు పెట్టి కాళేశ్వరం ప్రాజెక్టు చేపట్టారని అన్నారు. మూడు బ్యారేజీలు 20 నెలలుగా నిరుపయోగంగా మారాయని వెల్లడించారు. ప్రాణహిత-చేవెళ్ల డిజైన్లను అప్పటి సీఎం మార్చారని కమిషన్ చెప్పిందని వివరించారు. మేడిగడ్డలో బ్యారేజీ నిర్మించవద్దని వ్యాప్కోస్ నిపుణులు చెప్పినా వినకపోవడం వల్లే ఇన్ని సమస్యలు వస్తున్నాయన్నారు. రూ. 38 వేల కోట్లతో పూర్తయ్యే ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును పక్కనపెట్టి రూ. 1.47 లక్షల కోట్లతో కాళేశ్వరం చేపట్టి రూ. లక్ష కోట్లు ఖర్చు చేశారన్నారు. 2019 నుంచి 2023 వరకు లిఫ్ట్ చేసిన నీళ్లు 162 టీఎంసీలు మాత్రమేనని వివరించారు.

**లిఫ్ట్ చేసినవి 20.2 టీఎంసీలే..**

కాళేశ్వరం నుంచి ఏడాదికి 20.2 టీఎంసీలు మాత్రమే లిఫ్ట్ చేశారనీ, బ్యారేజీలకు జరిగిన నష్టం రాష్ట్రానికి పెనుభారంగా మారిందని మంత్రి తెలిపారు. రూ. లక్ష కోట్లు ఖర్చు చేసినా లక్ష ఎకరాలకు కూడా నీరు అందించలేకపోవడం తీవ్ర నష్టమేనన్నారు. తుమ్మిడిహెట్టి దగ్గర నీళ్లు ఉన్నాయని కేంద్ర మంత్రి ఉమాభారతి లేఖ రాసినా కేసీఆర్, హరీశ్‌రావు పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చాక ఇలాంటి విపత్తు ఏ రాష్ట్రంలోనూ జరగలేదన్నారు. మేడిగడ్డ బ్యారేజీ కుంగినప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉందన్నారు. ఎన్‌డీఎస్ఏ రిపోర్టుపై బీఆర్ఎస్ నేతలు ఇష్టమెచ్చినట్టు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ బిల్లు తెచ్చినప్పుడు బీఆర్ఎస్ మద్దతిచ్చిందని ఉత్తమ్‌కుమార్ వివరించారు.

# ఘోష్ కమిషన్ నివేదిక చిత్తుకాగితం

(మొదటి తరువాయి)



వివరిం చారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయి రీస్ యాక్టు-1952 ప్రకారం నోటీసులు ఇవ్వకుండా నిబంధనలు పాటించకుండా ఈ నివేదికను ఘోష్ కమి షన్ రూపొందించిందని విమర్శించారు. చట్టబద్ధంగా విచారణ జరగనందునే హై కోర్టును ఆశ్రయించామని వివ రించారు. మాజీ సీఎం కేసీఆర్, తనతోపాటు అధికారులకు 8 బీ ప్రకారం నోటీసు ఇవ్వకుండా కమిషన్లు ఇచ్చే నివేదికలు చిత్తు కాగితంతో సమానమని వ్యాఖ్యానించారు. గతంలో కోర్టులిచ్చిన తీర్పు లను ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు.ఎమర్జెన్సీ విధించినందుకు మాజీ ప్రధాని ఇందిరాగాంధీపై వేసిన షా కమిషన్‌పై ఆమె, లిబర్ హాన్ కమిషన్‌పై బీజేపీ నేత ఎల్‌కె అద్వానీ కోర్టుకు వెళ్లారని వివరించారు. వారు కోర్టుకెళ్తే ఒప్పు, తాము న్యాయస్థానానికి వెళ్తే తప్పు ఎలా అవుతుందని ప్రశ్నించారు. 660 పేజీల ఘోష్ కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ పెట్టకుండా ఆపాలంటూ తాను కోర్టును ఆశ్రయించలేదని చెప్పారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అడ్వకేట్ జనరల్ ద్వారా పిటిషన్‌ను తెప్పించుకోవాలని సూచించారు. నిబంధనల ప్రకారం విచారణ జరగననందున ఘోష్ కమిషన్ నివేదికను రద్దు చేయాలంటూ కోర్టును కోరామన్నారు. తాము సుప్రీంకోర్టుకు వెళ్తే ఆ నివేదిక క్వాష్ అవుతుందనే ఆందోళనతోనే సీఎం రేవంత్‌రెడ్డి కేవియట్ పిటిషన్ దాఖలు చేశారని చెప్పారు. అందుకే ఆదరాబాదరగా ఆదివారం అసెంబ్లీలో చర్చకు పెట్టారని అన్నారు. పీసీ ఘోష్ కమిషన్ తమ హక్కులను కాలరాసిందన్నారు. విచారణను ఎదుర్కొనే పౌరులు, నాయకులు, అధికారులకు హక్కులుంటా యని వివరించారు. నిష్పాక్షికంగా విచారణ జరగలేదన్నారు.

## ప్రజాగ్రహానికి దిగొచ్చిన ఇండోనేషియా సర్కారు

(మొదటి తరువాయి)

దేశంలో పరిస్థితుల రీత్యా చైనా పర్యటనను రద్దు చేసుకున్నట్లు ప్రకటించారు. నిరసనలతో నిర్ణయాలు వెనక్కి ఆగస్టు 25వ తేదీన ప్రారంభమైన నిరసనలు క్రమంగా దేశమంతా వ్యాపించాయి. ఈ ఘర్షణల్లో ఐదుగురు పౌరులు మృతి చెందారు. పెద్ద ఎత్తున చెలరేగిన నిరసనలకు ఇండోనేషియా ప్రభుత్వం దిగివచ్చింది. పార్లమెంట్ సభ్యుల ప్రయోజనాలను రద్దు చేస్తునట్లు ప్రకటించింది. ఆగేయాసియా దేశాల్లో అతిపెద్ద ఆర్థికవ్యవస్థ కలిగిన దేశం ఇండోనేషియా. గత అక్టోబర్‌లో అధికారం చేపట్టిన ప్రబోవో సబియాంటో ఆర్థికవ్యవస్థ కుదేలైందని ప్రకటించారు. పేదల సంక్షేమానికి కోత పెడుతూ.. మరోవైపు 580 మంది పార్లమెంట్ సభ్యుల గృహ అలవెన్సులను 50 లక్షల రూపియాలకు (రూ.35,000లకు) పెంచుతున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే ఎంపిలు తీసుకుంటున్న నెలవారీ జీతం కోటి రూపాయలకు ఇది అదనం. సామాన్య పౌరుడి సగటు ఆదాయం కన్నా ఎంపిల గృహ అలవెన్సు 20 రెట్లు ఎక్కువ. ప్రభుత్వం పెంచిన తీరును ఇండోనేషియన్లు వ్యతిరేకిస్తున్నారు. మరోవైపు అధ్యక్షుడు ప్రబొవో సుబియాంతో సమస్యను శాంతియుతంగా పరిష్కరించకపోతే దేశంలో అశాంతి తలెత్తె ప్రమాదముందని పలు దేశాలు హెచ్చరిస్తున్నాయి..

## శ్రీశైలం 10 గేట్లు ఎత్తివేత

(మొదటి తరువాయి)



ఎడమగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 35,315 క్యూసెక్కులు, కుడిగట్టు విద్యుత్ కేంద్రం నుంచి 30,624 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 882.80 అడుగుల వరకు నీరు ఉంది. ఇక ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం 215.80 టీఎంసీలు కాగా ప్రస్తుతం 203 టీఎంసీలుగా ఉంది. ఎగువ ప్రాంతం నుంచి వరద ఉధృతి ఉండటంతో మరికొన్ని గేట్లు ఎత్తే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు.

## సంపాదకీయం

# నారీ రక్ష



రాత్రికి దానికంటూ ఒక అందం వుంది. ఒక ప్రత్యేకమైన గుర్తింపు వుంది. రాత్రిపూట కవిత్వం కురుస్తుంది. 'రాత్రి అందాలను ఎప్పుడూ అనుభవించనివాడు నిజమైన కవి/ కళాకారుడు కాలేడు' అంటారో రచయిత. రాత్రిపూట ప్రపంచం ఒక కలలా అనిపిస్తుంది. 'స్నానం చేసి తలారబోసినట్లు ఆకాశంలో నల్లటి చీకటి' అంటూ రాత్రి సౌందర్యాన్ని వర్ణిస్తాడు శీలా వీర్రాజు ఓ కథలో. లెక్కలేనన్ని ఆలోచనలు, చిత్రాలు, రూపకాలు, దుఃఖాలు, భయాలు రూపుదిద్దుకుంటాయి చీకటిలో. అర్థరాత్రి ఆకాశం కింద ఫుట్‌పాత్‌లు రూపాంతరం చెందుతాయి. వెన్నెల వికసిస్తుంది. నల్లని తారు రోడ్లపై మృదువైన కిరణాలు నృత్యం చేస్తుంటాయి. అలసిన శరీరానికి, మనసుకు చంద్రుని వెలుగులో ఓదార్పు లభిస్తుంది. ఇంత అందమైన రాత్రి, స్త్రీలకు ఎందుకు చెడ్డదిగా, ప్రమాదకరమైనదిగా పరిగణించబడుతుంది? అమ్మాయిలు పురుషులతో సమానంగా ఎక్కడైనా స్వేచ్ఛగా జీవించగల ఈ సమాజంలో తమ కలలను సాకారం చేసుకోడానికి నిజంగా స్థలం లేదా? 'యత్ర నార్యస్తు పూజ్యంతే, రమంతే తత్ర దేవతాః' అంటూ మహిళలను దేవతలుగా పూజిస్తారు. అదే సమాజం నిజ జీవితంలో వారికి స్వేచ్ఛ, భద్రత, గౌరవం లేకుండా చేస్తున్నది. స్త్రీల పట్ల ఈ కపటత్వం ఎందుకు? పండు వెన్నెలయినా, వీధి దీపాలైనా రోడ్లను ప్రకాశవంతం చేస్తాయి. కానీ చాలామంది మహిళలకు ఈ చీకటి రాత్రులు కాళరాత్రిని తలపిస్తాయి. ఇంటికి వెళ్లే మార్గాన్ని భయం కబళించివేస్తుంది. జాతీయ వార్షిక నివేదిక మహిళల భద్రత సూచీ (ఎన్.ఎ.ఆర్.ఐ)–2025 ఈ విషయాన్ని ధృవీకరించింది.

దేశంలోని 31 నగరాల్లో సర్వే చేసిన జాతీయ మహిళా కమిషన్ 'నారీ సూచీ–2025' నివేదికను విడుదల చేసింది. ప్రతి ముగ్గురిలో ఒకరు వేధింపులకు గురవుతుండగా, 40 శాతం మంది మహిళలు సురక్షితంగా లేమని ఫీలవుతున్నట్లు ఈ నివేదిక వెల్లడించింది. రాత్రి వేళల్లో ముఖ్యంగా ప్రభుత్వ రవాణా మార్గాల్లో, వినోద ప్రదేశాల వద్ద భద్రతకు సంబంధించిన అవగాహనలో తీవ్రమైన తగ్గుదల వుందని ఈ అధ్యయనం తెలిపింది. మహిళలకు రక్షణ లోపించిన నగరాల జాబితాలో దేశ రాజధాని ఢిల్లీ వుండటం గమనార్హం. నాణేనికి రెండోవైపు అన్నట్లు ఇంటి బయటే కాదు, ఇంట్లోనూ దాదాపు ఇలాంటి పరిస్థితే వుంది. అదనపు కట్నం కోసమో, అనుమానంతోనో, తనకన్నా ఎక్కువ సంపాదిస్తున్నదనో భార్యను హింసించడం, హతమార్చడం సర్వసాధారణంగా మారింది. 'భార్యాభర్తలన్నాక ఇదంతా మామూలే కదా%ౌ%' అన్నాడు గ్రేటర్ నోయిడాలో భార్యను హత్యచేసిన తర్వాత విపిన్ భాటీ అనే ఓ ఘనాపాటి. దేశంలో ప్రతి నాలుగు నిమిషాలకు ఒక మహిళ హింసకు గురౌతోంది. దేశాభివృద్ధి కేవలం జీడిపి గణాంకాల్లో వస్తే చాలదు.. మన ఆలోచనా విధానంలో రావాలి. ఈ వికృత ధోరణులను పెంచి పోషిస్తోన్న వినిమయదారీ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలి. 'మహిళ స్వేచ్ఛ హక్కు మాత్రమే కాదు, అది సమాజ ఆత్మకు శ్వాస' అంటారు సరోజిని నాయుడు.

దేశంలో సామాజిక కట్టుబాట్లూ, సంప్రదాయాలు మహిళల్ని కట్టిపడేసినంతగా మగవాళ్లను పట్టించుకోవడం లేదు. 'విపిన్ భాటీ లాంటి వాళ్లుభార్యను హింసించడం మామూలే అన్న ధోరణిని చూసీ చూడనట్లుగా వుండటమో, చూసీ మౌనంగా వుండిపోవడమో అంటే, పరోక్షంగా మనమంతా ఈ నేరాలను సమర్థిస్తున్నట్లుగా, భాగస్వాములమైనట్లుగానో భావించాల్సిందే' అంటారో సామాజికవేత్త. ఐరాస చెప్పినట్లు.. మహిళలపై జరుగుతున్న హింసను మానవ హక్కుల ఉల్లంఘనగా పరిగణించాలి. సమాజంలో మహిళలపై హింసను ప్రేరేపిస్తున్న విష సంస్కృతి పట్ల ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపాలి. 'నేను ఆకాశాన్ని చేరుకున్నాను. కానీ, ప్రతి మహిళా భయంలేకుండా భూమిపై నడవగలగడం మరింత గొప్ప విజయమవుతుంది' అంటారు కల్పనా చావ్లా. మహిళ సురక్షితురాలు అయితేనే సమాజం సుసంపన్నం అవుతుంది. ఆమె భవిత కాంతివంతమైతేనే, దేశ భవిష్యత్ ఉజ్వలమౌతుంది. తమ బిడ్డలకు రాత్రిపూట భయపడకుండా 'వెళ్లి చంద్రుడిని చూడండి, వెన్నెల్లో వీచే చల్లగాలిని ఆస్వాదించండి, స్వేచ్ఛగా జీవించండి' అని గర్వంగా చెప్పగలిగే పరిస్థితిని సృష్టిద్దాం.

# కేరళను చూస్తే అసూయ కలుగుతోంది

## సీఎం రేవంత్ రెడ్డి



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి



హైదరాబాద్ –ప్రజా స్వేచ్ఛ

కాంగ్రెస్ నేత కేసీ వేణుగోపాల్‌పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆదివారం కేరళలోని అలెప్పీలో కేసీ వేణుగోపాల్ రచించిన పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసీ వేణుగోపాల్ ఎల్లప్పుడూ పేదల పట్ల, అణగారిన వర్గాల కోసం పోరాడుతూనే ఉన్నారని ప్రశంసించారు. అణిచివేతకు, అన్యాయానికి గురవుతున్న బాధితుల తరపున గొంతుకగా నిలుస్తున్నారని అన్నారు. ఆయన కేరళ రాష్ట్రానికే కాకుండా యావత్ దేశంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ, ప్రత్యేకించి మహిళలు, పిల్లల న్యాయం కోసం, వారి అభ్యున్నతి కోసం నిరంతరం పాటుపడుతున్నారని చెప్పారు. 2006లో వేణుగోపాల్ ప్రారంభించిన పొంథువల్ (ఎంపీ) మెరిట్ అవార్డులకు దేశంలోనే చాలా ప్రత్యేకత ఉంది. 10వ తరగతి, 12వ తరగతి విద్యార్థినీ విద్యార్థుల్లో అత్యుత్తమ ప్రతిభను గుర్తించి వారిని ప్రోత్సహించడానికి, వారిలో ఒక స్ఫూర్తిని నింపడానికి ఈ మెరిట్ అవార్డులు ఎంతగానో దోహదపడుతున్నాయని అన్నారు. 'ఈ ఏడాది వందశాతం ఫలితాలను సాధించిన 150 పాఠశాలల్లో దాదాపు 3,500 లకుపైగా ప్రతిభ కలిగిన విద్యార్థులకు అవార్డులు అందిస్తున్నారు. దేశంలో విద్యకు, కేరళ రాష్ట్రానికి బలమైన సంబంధం ఉంది. దేశంలో వందశాతం అక్షరాస్యత సాధించిన తొలి రాష్ట్రం కేరళ. ఈ రాష్ట్రంలో అమలు చేస్తున్న వయోజన విద్యా కార్యక్రమం అన్ని రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోంది. కేరళ రాష్ట్రంలో విద్యా రంగానికి ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారు. 10వ, 12వ తరగతి తర్వాత.. సున్నా శాతం డ్రాప్ అవుట్స్ సాధించడమంటే అందులో ఆశ్చర్యమేమీ ఉండదు. విద్య అనేది మనకు లభించిన ఒక గొప్ప బహుమతి. విద్య అన్నది ఒక గొప్ప ఆయుధం. అదే అందరికీ గొప్ప శక్తి.. అని నేను చాలా బలంగా విశ్వసిస్తా. అలాంటి విద్యకు ప్రాధాన్యతనిస్తున్న దైవ భూమి కేరళ. అందుకే అందరితో పాటు నాకు కూడా కేరళను చూస్తే అసూయగా ఉంది' అని రేవంత్ రెడ్డి ప్రశంసల వర్షం కురిపించారు.

# బాణాసంచా ఫ్యాక్టరీలో పేలుడు..

## ఏడుగురు దుర్మరణం..!



లక్నో ప్రజా స్వేచ్ఛ

ఉత్తరప్రదేశ్‌లోని లక్నోలో ఆదివారం బాణాసంచా ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించింది. భారీ శబ్దంతో ఆ ప్రాంతమంతా దద్దరిల్లిపోయింది. స్థానికులు సంఘటనా స్థలానికి చేరుకొని ఫ్యాక్టరీలో చిక్కుకుపోయిన వారిని రక్షించేందుకు ప్రయత్నించారు. గుడంబా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని బెహ్తా ప్రాంతంలో ఈ సంఘటన జరిగింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ కార్మికులను పోలీసులు అంబులెన్సుల్లో ఆసుపత్రికి తరలించారు.ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. ఈ పేలుడు ఘటనలో దాదాపు ఏడుగురు మరణించినట్లు సమాచారం. దాదాపు ఐదుగురు తీవ్రంగా గాయపడినట్లుగా సమాచారం. సహాయ, సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. బాణాసంచా ఫ్యాక్టరీ పేలుడు ప్రమాదంపై సీఎం ఆదిత్యనాథ్ ఆరా తీశారు. మృతుల కుటుంబాలకు ఆయన సంతాపం తెలిపారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గాయపడిన సరైన చికిత్స అందించాలని సూచించారు.

# టిఎంసి ఎంపి మహువా మొయిత్రాపై ఎఫ్ఐఆర్



**రాయ్‌పూర్ ప్రజా స్వేచ్ఛ**

కేంద్ర హెూంమంత్రి అమిత్‌షాపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలపై తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాపై ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు పోలీసులు ఆదివారం తెలిపారు. స్థానిక నివాసి గోపాల్ సమంటో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా, శనివారం మానా పోలీస్ స్టేషన్‌లో మొయిత్రాపై బిఆర్ఎన్ (బిఆర్ఎస్) సెక్షన్ల 196,197ల కింద కేసు నమోదు చేసినట్లు ఒక అధికారి పేర్కొన్నారు. గత గురువారం పశ్చిమబెంగాల్‌లోని నాడియా జిల్లాలో జరిగిన ఒక కార్యక్రమంలోమహు వా మొయిత్రా మాట్లాడుతూ.. సరిహద్దు భద్రతపై మోడీ ప్రభుత్వం తన బాధ్యతలను విస్మరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.అయితే ఆ కార్యక్రమంలో ఆమె అమిత్‌షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారని గోపాల్ సమంటో ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యలు రాజ్యాంగవిరుద్ధమని అన్నారు. 1971లో రాయ్‌పూర్‌లోని మానా క్యాంప్ ప్రాంతంలో పెద్ద సంఖ్యలో బంగ్లాదేశ్ శరణార్థులు స్థిరపడ్డారని, మొయిత్రా ప్రకటన వారిలో భయాన్ని సృష్టించిందని అన్నారు. ఇటువంటి వ్యాఖ్యలు ఆ శరణార్థులపై ఇతర వర్గాల్లో ఆగ్రహాన్ని రేకెత్తించే అవకాశం ఉందని అన్నారు.

# తెలుగు సాహిత్యంపై చెరగని సంతకం శ్రీశ్రీ

**గుంటూరు ప్రజా స్వేచ్ఛ**

దోపిడీ, పీడలనలపై శ్రీశ్రీ తన కవిత్వం ద్వారా ధిక్కార స్వరం వినిపించాడని కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత డాక్టర్ పాపినేని శివశంకర్ అన్నారు. జాషువా విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా బ్రాడీపేటలోని విజ్ఞాన కేంద్రంలో మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అధ్యక్షతన మహాప్రస్థానం 75వ వార్షికోత్సవ సభ శనివారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా పాపినేని శివశంకర్ మాట్లాడుతూ సమానత్వపు పరిమళాలు గుబాళించేలా, మానవత్వం విరాజిల్లేలా మహాకవి శ్రీశ్రీ కవిత్వం నేటికీ స్ఫూర్తిదాయకంగా నిలుస్తోందన్నారు. తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ



కవిత్వానికి, ముఖ్యంగా మహాప్రస్థానానికి ప్రత్యేక స్థానం ఉందని వివరించారు. సమాజంలో నెలకొన్న పేదరికం, నిరుద్యోగం, ఆకలి వంటి సమస్యలపై అత్యంత ఆవేదనకు గురైన శ్రీశ్రీ తన కవిత్వపు బావుటాను ఎగుర వేశారని అన్నారు. 'మరో ప్రపంచం పిలిచింది', 'నేను సైతం ప్రపంచానికి సమిధనొక్కటి ఆహుతినిచ్చాను' అంటూ తన రచనా సంపుటాలతో ఆయన గర్జించారని గుర్తు చేశారు. తనదైన శైలిలో అభ్యుదయ భావనలను నింపి అత్యంత సులువైన, సున్నితమైన సాహిత్యంతో నవ సమాజపు నిర్మాణం వైపు కొత్త ఆశలు చిగురింపచేశారని పేర్కొన్నారు. విప్లవ రచయితల సంఘం రాష్ట్ర నాయకులు సిఎస్ఆర్ ప్రసాద్ మాట్లాడుతూ ఒక పక్క ఆయన కవిత్వం, వ్యాసాలు సాహిత్యాన్ని రంజింపచేయగా, మరో వైపు ఆయన సినీ సాహిత్యం ముఖ్యంగా అభ్యుదయ పాటలు సాహిత్య ప్రియుల్ని, ప్రేక్షకులను అలరించాయని వెల్లడించారు. ఆయన కవిత్వాన్ని యువత అధ్యయనం చేయాలని సూచించారు.


# పెన్షనర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక



**రామన్నపేట -ప్రజా స్వేచ్ఛ**

పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు జిల్లా అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి ఎన్నికల పరిశీలకులుగా కార్య నిర్వహణ అధికారి ఈ భీష్మారెడ్డి టీ మల్లయ్య కే గోపాల్ వారి సమక్షంలో ఏకగ్రీవంగా కమిటీని ఎన్నుకోవడం జరిగింది మండల అధ్యక్షులుగా జి రామ్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా జి అంజయ్య కోశాధికారిగా టి సూర్యనారాయణ అసోసియేట్ అధ్యక్షుడిగా బి గోవర్ధన చారి ఉపాధ్యక్షులుగా కే సుదర్శన్ మహిళా విభాగంలో సిహెచ్ పుష్పకళ జాయింట్ సెక్రటరీగా వి సత్యనారాయణ ఆర్గనైజింగ్ సెక్రటరీగా టీ భిక్షపతి పబ్లిసిటీ సెక్రటరీగా టీ మల్లికార్జున్ జిల్లా కౌన్సిల్ సభ్యులుగా ఎండి మన్సూర్ అలీ డి శంకరయ్య ను ఎన్నుకోవడం జరిగింది ఈ సందర్భంగా ఎన్నికైన అధ్యక్షులు మాట్లాడుతూ పెండింగ్ డిఏలు పిఆర్ సి హెల్త్ కార్డ్స్ ఇన్కమ్ టాక్స్ విషయంతో పాటు సంఘం బలోపేతం కోసం పెన్షనర్ల సమస్యల పరిష్కరిస్తూ సామాజిక స్పృహతో పనిచేయడం జరుగుతుందని తెలిపారు

## అంగరంగ వైభవంగా నవరాత్రుల పూజలందుకుంటున్న తల్వార్ యూత్ గణనాథుడు




**ఘట్కేసర్ --ప్రజా స్వేచ్ఛ**

మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటీ రాజీవ్ గృహకల్ప లోని తల్వార్ యూత్ గణనాథుడు భక్తిశ్రద్ధలతో నవరాత్రుల పూజలు అందుకుంటున్నాడు. ఆదివారం రోజు రాత్రి చిన్నపాక రాణి సంజయ్ కుమార్ కుటుంబ సభ్యులు లంబోదరుడికి ప్రత్యేక పూజ కార్యక్రమాన్ని వేద పండితులు సాయి వెంకట్ నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తల్వార్ యూత్ కమిటీ సభ్యులు వినయ్ అఖిల్ వంశీ సంతోష్ మహేష్ సాయి వంశీ ఉదయ్ కిరణ్ ప్రశాంత్ సాగర్ హేమంత్ అశోక్ గౌతం రాజేష్ సంజీవ్ సాయి బాబి సన్నీ వర్షిత్ అరవింద్ లతోపాటు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# రాజిరెడ్డి కుటుంబ సభ్యులకు అండగా ఉంటా

**కేంద్ర ఖాదీ,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం**




**వర్ధన్నపేట -ప్రజా స్వేచ్ఛ**

ఇటీవల మృతి చెందిన పింగిలి రాజిరెడ్డి కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం హామీ ఇచ్చారు.వర్ధన్నపేట మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన పింగళి రాజి రెడ్డి ఇటీవల మృతి చెందాడు. ఆదివారం ఆయన దశ దిన కార్యక్రమానికి కేంద్ర ఖాదీ మరియు చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం ముఖ్యఅతిథిగా హాజరై రాజిరెడ్డి చిత్ర పటానికి నివాళులర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పింగళి రమేష్ రెడ్డి, ద్రోపతి శ్రీనివాస్ రెడ్డి, లెక్కల వాసుదేవ రెడ్డి, కరిమిళ్ల సంపత్ రావు, జెన్నపురెడ్డి దేవేందర్ రెడ్డి, ప్రభాకర్, ఎల్లగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక యధావిధిగా జరుగుతుంది

**కలెక్టర్ వెంకట మురళి**

**బాపట్ల. -ప్రజా స్వేచ్ఛ**

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం కలెక్టరేట్లో జరుగుతుందని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి ఒక ప్రకటన తెలియ జేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం నందు ఈ క్రమంలో ప్రతీ మండల స్థాయిలోని రెవెన్యూ కార్యాలయల్లో , రేపల్లె మరియు చీరాల రెవెన్యూ డివిజన్ కార్యాలయాల్లో జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా అర్జీదారులు వారి యొక్క అర్జీలు నమోదు చేసు కోవడానికి , మీకోసం.ఏపీ. గవర్నమెంట్.ఇన్, (మీకోసం డాట్ ఏపీ డాట్ జివో వి డాట్ ఇన్) వెబ్సైట్ నందు వారి యొక్క అర్జీలు నమోదు చేసుకోవచ్చునని అయన తెలిపారు.

# ఘనంగా శివ భాస్కరరావు పదవి విరమణ సభ...

**-హాజరైన ప్రముఖులు..**



**మహబూబాబాద్, ప్రజా స్వేచ్ఛ**

(నీలగిరి ఎక్స్ ప్రెస్): సర్వీసులో ఎలాంటి రిమార్క్ లేకుండా 39 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు సర్వీసు ను ఏకుల శివ భాస్కరరావు పూర్తిచేసుకుని మహబూబాబాద్ అసిస్టెంట్ షెడ్యూల్డ్ కులాల డెవలప్మెంట్ ఆఫీసర్ గా ఈరోజు అనగా ఆగస్టు 31వ తేదీ ఆదివారం పదవి విరమణ కార్యక్రమం అంగరంగ వైభవంగా విజయవంతంగా జరిగింది. మహబూబాబాద్ లోని కలెక్టర్ కార్యాలయం ఎదురుగా డిఎస్ఆర్ కాంప్లెక్స్ లో శివ భాస్కరరావు పదవి విరమణ కార్యక్రమం జరిగింది. కార్యక్రమానికి భద్రాద్రి కొత్తగూడెం ఎస్సీ కార్పొరేషన్ ఇడి శ్రీమతి డి.అనసూర్య ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖలో అతిపిన్న వయసులో అనగా 1987లో వార్డెన్ గా తన ప్రస్థానాన్ని ప్రారంభించిన ఏకుల శివ భాస్కరరావు అదే హోదాలో ఆయన సొంత జిల్లా ఖమ్మం ఏజెన్సీ ప్రాంతంలో 39 సంవత్సరాల పాటు ఏకదాటిన వార్డెన్ గా పనిచేశారు. పదోన్నతి పై గత ఆరు సంవత్సరాలుగా మహబూబాబాద్ లో ఏ ఎస్ డబ్ల్యూ ఓ గా పనిచేస్తూ అందరి మన్ననలు పొందిన శివ భాస్కరరావు ఆదివారం పదవి విరమణ పొందడం జరిగింది. విశేషమేమిటంటే సాంఘిక సంక్షేమ శాఖ లో సర్వీస్ లో చేరకముందే అతి చిన్న వయసులో మూడు సంవత్సరాల పాటు సింగరేణిలో ప్రభుత్వ టీచర్ గా పనిచేసి, సాంఘిక సంక్షేమ శాఖలో వార్డెన్ గా సెలెక్ట్ అయి 39 సంవత్సరాల పాటు సేవలను అందించారు. విశేషమేమిటంటే తాను టీచరుగా, వార్డెన్ గా పనిచేసిన కాలంలో తన శిష్యరికంలో చదివిన వసంతం లో ఉన్న విద్యార్థులు ఎందరో నేడు ఉన్నత స్థానంలో ఉన్నారు. వారంతా దాదాపుగా శివ భాస్కరరావు పదవి విరమణ కార్యక్రమానికి విచ్చేసి సర్ప్రైజ్ చేయడం విశేషం. ఈ కార్యక్రమంలో శివ భాస్కరరావు – సుజాత దంపతుల తో పాటు కుటుంబ సభ్యులు బంధుమిత్రులు, శిష్యులు, శ్రేయోభిలాషులు ఎస్సీ డిడి జిల్లా కార్యాలయ సిబ్బంది, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు ఏఎస్ డబ్ల్యూ ఓ లు అనుకున్న దానికి రెట్టింపుగా హాజరై శివ భాస్కరరావు పదవీ విరమణ కార్యక్రమాన్ని విజయవంతం చేసి ఆశీస్సులు అందజేసి ఆ దంపతులకు అభినందనలు కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# కల్వకుంట్ల కాదు.. కల్వకుండా చేసే కుటుంబం

**బీసీ రిజర్వేషన్లపై చిలువలు, పలువలు చేయొద్దు : సీఎం రేవంత్‌రెడ్డి**



తెలంగాణ న్యాయవాదుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు తరిగొప్పుల మహేందర్ ప్రజాపతి రిటైర్డ్ జడ్జి కాంగ్రెస్ నాయకుడు రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధి




**హైదరాబాద్ -ప్రజా స్వేచ్ఛ**

కేసీఆర్‌ది కల్వకుంట్ల కాదు ఎవరినీ కల్వకుండా చేసే కుటుంబమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. అందుకే బీసీ బిల్లుకు అడ్డు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మైనారిటీలు.. హిందువులు కలవకుండా, బీసీలు.. ఓసీలు కలవకుండా, ఎస్సీలు.. ఎస్టీలు కలవకుండా చూడటమే కల్వకుంట్ల కుటుంబ లక్ష్యమని రేవంత్ ఎద్దేవా చేశారు. ఆదివారం అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లుపై చర్చ సందర్భంగా ప్రతిపక్ష సభ్యుల విమర్శలపై సీఎం స్పందించారు. బీసీ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదిస్తే కేంద్రం మీద ఒత్తిడి తెచ్చే అవకాశం ఉంటుందన్నారు. బిల్లుపై చర్చకు ప్రతిపక్ష నేత హోదాలో కేసీఆర్ వచ్చి ఉంటే ఆయన పెద్దరికం నిలిచేదని చెప్పారు. 'తాను చెడ్డ కోతి వనమల్లా చెడగొట్టినట్టు' కేసీఆర్ వ్యవహారం ఉందన్నారు. కేసీఆర్ ఒత్తిడికి లొంగకుండా బిల్లుకు మద్దతు తెలపాలని గంగుల కమలాకర్‌ను కోరారు. రాజకీయ వివాదాలకు తావివ్వకుండా, ఆరోపణలు చేయకుండా మంచి ఉద్దేశంతో తెచ్చిన బిల్లుకు మద్దతివ్వాలని కోరారు. 'బీసీ నాయకులు ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవద్దు. ఈ ఒక్క విషయంలోనన్నా కేసిఆర్ ఒత్తిడికి లొంగొద్దు. నువ్వేం వాళ్లకు భయపడకు మిత్రమా. మనం పాత మిత్రులమే కదా. నీకు తెల్వంది ఏముంది. వాళ్లకు ఇష్టం లేదు. వాళ్ల పోకడలు ఎట్లుంటయో నీకు తెల్వదా. నేను చెప్పాల్నా. నాకు వాళ్ల గురించి చానా తెలుసు.. కాబట్టే కర్రు కాల్చి వాత పెట్టి ఇక్కడొచ్చి కూర్చున్నా' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టం బీసీల రిజర్వేషన్లకు గుదిబండగా మారిందని విమర్శించారు. ఆ అడ్డంకులను తొలగించేందుకు ఆర్డినెన్స్ తెచ్చామన్నారు. బీఆర్ఎస్ తెర వెనుక ఉండి దాన్ని ఆమోదం పొందకుండా కుట్రలు చేస్తున్నదని ఆరోపించారు. బీసీ రిజర్వేషన్లపై చర్చించేందుకు అపాయింట్‌మెంట్ ఇవ్వాలంటూ ఐదుసార్లు ప్రధాని మోడీకి లేఖ రాసినా ఆయన స్పందించలేదన్నారు. అందుకే బీసీ రిజర్వేషన్లపై తాము ఢిల్లీ జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తే వివిధ పార్టీలకు చెందిన 100 మంది ఎంపీలు మద్దతు ఇచ్చారు కానీ రాజ్యసభలో బీఆర్ఎస్ ఎంపీలు అటువైపు కన్నెత్తి కూడా చూడలేదని విమర్శించారు. కడుపులో కావాల్సినంత విషం పెట్టుకుని బీఆర్ఎస్ సభ్యులు మాట్లాడుతున్నారని సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు.

# ముందస్తుగా ఘనంగా పరకాల ఎమ్మెల్యే రేవూరి జన్మదిన వేడుకలు



**పరకాల టౌన్, -ప్రజా స్వేచ్ఛ**

: పరకాల మున్సిపాలిటీ పరిధిలోని రెండో వార్డులో పరకాల పట్టణ సమన్వయ కమిటీ సభ్యులు దుబాసి వెంకటస్వామి అధ్యక్షతన వార్డ్ సమావేశంలో భాగంగా పరకాల అభివృద్ధి ప్రదాత, నిరంతరం ప్రజాసేవే ధ్యేయంగా పనిచేస్తున్న పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి జన్మదిన వేడుకలు ముందస్తుగా జరుపుకోవడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరకాల నియోజకవర్గ అభివృద్ధి కోసం పాటుపడుతున్న గొప్ప వ్యక్తి ప్రకాష్ రెడ్డి అని, పరకాల ఎమ్మెల్యే నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటున్నామని, తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సారధ్యంలో రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రతి పేద కుటుంబాలకు అందిస్తున్నారని దానిని సద్వినియోగం చేసుకొని అందరూ అభివృద్ధి పరచే విధంగా పాటుపడుతున్నారని, పరకాల నియోజకవర్గం లోని అన్ని మండల పట్టణ డివిజన్ ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం పని చేసే విధంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎస్సీ విభాగం అధ్యక్షులు బొమ్మకంటి చంద్రమౌళి, కాంగ్రెస్ నాయకులు బొచ్చు మోహన్, బొచ్చు జెమిని, బొచ్చు అనంతరావు, మడికొండ చెంగల్ రావు, మంద శ్యామ్, మడికొండ లలిత, బొచ్చు కట్టయ్య, బొచ్చు రాకేష్, బొచ్చు నరసయ్య, బొచ్చు సాంబయ్య, బొచ్చు సంపత్, బొచ్చు రవికుమార్, బొచ్చు అనుష ప్రవీణ్, బొచ్చు రమేష్, బొచ్చు కిరణ్, బొచ్చు విజయ, బొచ్చు సమ్మక్క, బొచ్చు రాజమ్మ, ఒంటేరు అజయ్, పెద్ద ఎత్తున తదితరులు పాల్గొన్నారు.

# అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి





**ప్రజా స్వేచ్ఛ ఘట్కేసర్ ప్రతినిధి**
మేడ్చల్ జిల్లా పోచారం మున్సిపాలిటి పరిధి సింగపూర్ టౌన్షిప్ కళావేదికలో నవరాత్రుల సందర్భంగా కొలువైన గణనాధుని వద్ద భక్తులకు ఆదివారం రోజు మధ్యాహ్నం అన్నదాత మెట్టు భాస్కర్ రెడ్డి కుటుంబ సభ్యులు అన్నదాన కార్యక్రమాన్ని చేశారు ఈ కార్యక్రమానికి పోచారం మున్సిపాలిటీ 9వ వార్డు మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి పాల్గొన్నారు. టౌన్షిప్ లో జరిగిన అన్నదాన కార్యక్రమం తో పాటు ఆర్జికే లోని లెన్విన్ వినాయక మండపం అన్నోజి గూడ లోని సాయి నగర్ లోని మరో మూడు వినాయక మండపాలలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు



ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయక మండపాల వద్ద అన్న ప్రసాద వితరణ చేసిన దాతలకు విఘ్నేశ్వరుడు సకల సౌఖ్యాలు కలిగే విధంగా దీవెనలు అందివ్వాలని అన్నం పరబ్రహ్మ స్వరూపమని వినాయక నవరాత్రుల్లో భాగంగా భక్తులకు అన్నదానం చేయడం సామాజిక సేవతో పాటు ప్రజల్లో భక్తి భావం పెరుగుతుందని గణపతి దేవుని చల్లని చూపు ప్రజలందరిపై ఉండి అన్నదాతలకు భక్తులకు మంచి జరిగేలా దీవించాలని పోచారం మున్సిపాలిటీ అన్ని విధాలుగా అభివృద్ధి చెంది ప్రజలందరూ సుఖసంతోషాలుగా ఉండాలని గణనాధుని కోరుకున్నానని మాజీ కౌన్సిలర్ మెట్టు బాల్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో వినాయక మండపాల నిర్వాహకులు అన్నదాతల కుటుంబ సభ్యులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# నీళ్లను ఒడిసిపట్టి జలరాశులను పెంపొందించింది కెసిఆర్

**–జల పూజలు చేసిన సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి**

**ప్రజా స్వేచ్ఛ వనపర్తి జిల్లా ప్రతినిధి**
నీళ్లను ఒడిసిపట్టి జలారాశులనుపెంపొడించిందని కె సి ఆర్ అని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూపోడు భూముల రైతులకు పట్టాలు ఇచ్చిన ఘనత కె.సి.ఆర్ ది. నిండు కుండలా మారిన కుంటలను సందర్శించి జలపూజలు చేసిన మాజీ మంత్రివర్యులు. స్వయంగా రైతులతో కలసి ట్రాక్టర్ నడిపిన నిరంజన్ రెడ్డి వనపర్తి మండలం తిరుమలయ్య గుట్ట ఫారెస్ట్ నందు నిర్మించిన తిరుమలయ్య కుంట మరియు పెద్దగూడెం తండా ధీద్య కుంటలను మాజీ మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి. ఈరోజు నాయకులు,రైతులతో కలసి సందర్శించి నిండుకుండలా నీళ్లతో నిండిన జలాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బి.ఆర్.ఎస్ హయాములో ప్రతి నీటిబొట్టును ఒడిసిపట్టి వృథా



కాకుండా నీళ్లను ఎక్కడికక్కడ చెక్ డ్యాంలు,కుంటలు నిర్మించి కాపాడిన ఘనత కె.సి.ఆర్ ది అని కొనియాడారు. తన హయాములో తిరుమలయ్య గుట్ట అటవీ ప్రాంతములో ఉన్న చిన్న కుంటను మరియు పెద్దగూడెం తండా ధీద్య కుంటను ఆధునీకరించి చెరువులను తలపించే విధంగా పునర్నిర్మించామని అన్నారు. ఈ కుంటలవల్ల చాలా ఏండ్లుగా గిరిజన రైతులు తమ సొంత పొలాలతో పాటు పోడు భూములను సాగు చేసుకొనేవారని ఆనాటి పరిస్థితులలో నీళ్లు లేక చాలా ఇబ్బంది పడేవారని ఈ కుంటల నిర్మాణంతో రైతులకు సాగునీరుతో పాటు ఆటవి జీవులకు త్రాగునీరు అవకాశం కలిగి పశు పక్షాధులకు ఈ ప్రాంతములో అభివృద్ధి చెందాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పోడు భూములు సాగు చేసుకుంటున్న 32మంది రైతులకు పట్టాలు ఇచ్చామని ఇంకా గుర్తించబడ్డ 62మంది రైతులు ఇంకా మిగిలారని మా ప్రభుత్వం వచ్చిన వెంటనే వారికి కూడ పట్టాలు ఇస్తామని హామీ ఇచ్చారు. నిరంజన్ రెడ్డి వెంట గట్టు యాదవ్ వాకిటి శ్రీధర్, కె.మాణిక్యం,రవిప్రకాష్ రెడ్డి, మాధవ్ రెడ్డి,నరేష్, దేవర్ల.నరసింహ,మహేశ్వర్ రెడ్డి,ధర్మా నాయక్,ఎర్ర. సాయిప్రసాద్,సునీల్ వాల్మీకి, చిట్యాల.రాము,జోహేబ్ హుస్సేన్,కొండన్న, తిరుమలయ్య, కృష్ణా నాయక్,టేక్యా నాయక్, నారాయణ నాయక్,చత్రూ నాయక్ తదితరులు ఉన్నారు.

# ప్రకృతి విలయతాండవం

**– మెదక్ జిల్లాలో కలెక్టర్ పర్యటన**



**ప్రజా స్వేచ్ఛ – మెదక్ జిల్లా ప్రతినిధి (రాము)**
మెదక్ జిల్లాలో కురిసిన భారీ వర్షాలు, వరదలతో 11 మండలాల్లో తీవ్ర నష్టం సంభవించింది. రామాయంపేట, నిజాంపేట్ మండలాల్లో 300 మిల్లీమీటర్లకు పైగా వర్షపాతం నమోదై రోడ్లు, వంతెనలు, కల్వర్టులు దెబ్బతిన్నాయి. నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, తాత్కాలిక మరమ్మతులు చేసి రవాణా పునరుద్ధరించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, వ్యవసాయ శాఖలు క్షేత్రస్థాయిలో నష్టాలను అంచనా వేస్తున్నాయని తెలిపారు. వరదలతో 130 గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడగా, యుద్ధ ప్రాతిపదికన పునరుద్ధరించామని కలెక్టర్ వెల్లడించారు. త్రాగునీటి పైపులు, చెరువుల కట్టలు దెబ్బతిన్నా వెంటనే మరమ్మతులు చేపట్టినట్లు చెప్పారు. మహారాష్ట్రలో వర్షాలు కొనసాగుతున్న కారణంగా మంజీరా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వాగులు, చెరువులు దాటే సాహసం చేయవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ పర్యటనలో రెవిన్యూ, ఆర్ అండ్ బి అధికారులు, స్థానిక తహసీల్దార్లు పాల్గొన్నారు.

# రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేసిన మెట్పల్లి బిజెపి నేతలు



**మెట్ పల్లి ప్రజా స్వేచ్ఛ**
మెట్ పల్లి పట్టణంలో పాత బస్టాండ్ వద్ద భారతీయ జనతా పార్టీ మెట్ పల్లి పట్టణ శాఖ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో నరేంద్ర మోడీ తల్లి మీద అన్చిత వ్యాఖ్యలు చేసిన రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించి సామాజిక విలువలు నేర్పిన మాతృమూర్తి మీద రాహుల్ గాంధీ అనుచిత వ్యాఖ్యలు చేయడం పట్ల అగ్రహం వ్యక్తం చేస్తూ దిష్టిబొమ్మను దానం చేయడం జరిగింది. విలువలు లేని వ్యక్తి కాంగ్రెస్ అధినేత రాహుల్ గాంధీ అని రాహుల్ గాంధీ తక్షణమే క్షమాపణ చెప్పాలని రాహుల్ గాంధీ కి తాత ఫిరోజ్ ఖాన్ గురించి తెలుసుగాని ఈ దేశం గురించి తెలియని అజ్ఞాని రాహుల్ గాంధీ అని ఈ సందర్భంగా బిజెపి పట్టణ అధ్యక్షులు బొడ్ల రమేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ , అసెంబ్లీ కన్వీనర్ చెట్లపల్లి సుఖేందర్ గౌడ్, బీజేవైఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ధోనికెల నవీన్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శి సుంకేటి విజయ్, మర్రి నందకిషోర్, పట్టణ ఉపాధ్యక్షులు బోడ్ల నాగేష్ , జుంగుల అనిల్, సుంకేట అశోక్, తోగిటి రమేష్ , బీజేవైఎం జిల్లా అధికార ప్రతినిధి బొడ్ల నరేష్ , మరంపల్లి శ్రీనివాస్, తోకల సత్యనారాయణ, బోడ్ల ఆనంద్, దండికే నరసయ్య , బి.అనిల్, కాదాస్తు శ్రీనివాస్, బి.గౌతమ్, గుండవేని శేఖర్, భోగ తిలక్, బుర్ర హరీష్ తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి ఆశీస్సులు ప్రజలకు ఏల్లప్పుడు ఉండాలి

**-కుటుంబ సభ్యులతో ప్రత్యేక పూజలో పాల్గొన్న బీ జే పీ నాయకులు కొమ్ము సురేష్**



**కొత్తకోట.ప్రజా స్వేచ్ఛ**
సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగలు జరుపుకొని ఉత్సాహపూరిత వాతావరణం లో గణపతి నిమజ్జన కార్యక్రమాలు కూడా జరుపుకోవాలని కొమ్ము సురేష్ కోరారు. ఆదివారం మండల కేంద్రంలో ప్రతిష్టించిన, వినాయక మండపాన్ని కుటుంబ సబ్యలతో సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు శాలువాలతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో ఐక్యమత్యంతో ఇలాంటి పండగలు జరుపుకోవాలని అన్నారు. వినాయక చవితి హిందువుల కు పర్వధీనం. మన సనాతన ధర్మానికి ప్రతీక అన్నారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతికగా వినాయక చవితి పండుగ జరుపుకుంటారని అన్నారు. రాష్ట్ర ప్రజలు,దేశానికీ వెన్నముక్కలాంటి రైతన్నలు,సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో విజయం, శాంతిని,అందించడమే కాకుండా,మనలో నమ్మకాన్ని, విశ్వాసాన్ని కలిగిస్తుందన్నారు. ఇట్టి కార్యక్రమంలోహిందూ వాహినిసభ్యులు పాల్గొన్నారు

# మృతురాలి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే టి.మేఘరెడ్డి ఆర్థిక సహాయం


**పెద్దమందడి కి చెందిన బోయ జానమ్మ మృతి**



**ప్రజా స్వేచ్ఛ పెద్దమందడి/వనపర్తి జిల్లా ప్రతినిధి**
పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన బోయ జానమ్మ, మృతి చెందిన విషయం స్థానిక నాయకుల ద్వారాతెలుసుకున్న ఎమ్మెల్యే టి.మేగారెడ్డి తక్షణమే స్పందించి,కాంగ్రెస్ నాయకుల ద్వారా,దహన సంస్కారాలకు ?5000/- పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు టైలర్ రవి, నందిమల్ల కురుమన్న,చిన్న మన్యం,గొడుగు రామచంద్రయ్య,మేస్త్రి కృష్ణయ్య,బోయ స్వామి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఆర్థిక సహాయాన్ని అందుకున్న మృతురాలి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే తూడి మేగారెడ్డి కి ధన్యవాదాలు తెలియజేశారు

# టిఎస్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ రాక

**–శాలువతో ఘనంగా సన్మానించిన కుటుంబ సభ్యులు.**
**–జగన్ ని మర్యాదపూర్వకంగా కల్సిన డిఎస్.మహేష్**





**ప్రజా స్వేచ్ఛ**
**పెద్దమందడి/ వనపర్తి జిల్లా ప్రతినిధి**
తెలంగాణ రాష్ట్ర, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన అడ్వకేట్ జగన్, శనివారం పెద్దమందడి మండలం,వెలటూర్ గ్రామానికి చెందిన, హైకోర్టు ఎ జి పి డి. హంసు వర్మ, ఇంటికి విచ్చేసిన సందర్బంగా, శుభాకాంక్షలు తెలిపి,కుటుంబ సభ్యులు శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్బంగా డిఎస్. మహేష్ మాట్లాడుతూ తొలి సారిగా తెలంగాణ రాష్ట్ర హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడి హెూదాలో,మా గ్రామాన్ని సందర్శించి ఇంటికి వచ్చిన సందర్భంగా తేనేటి విందులో పాల్గొన్నారు. అనంతరం అనంతరం వారి కుటుంబ సభ్యులు శుభాకాంక్షలు తెలిపి, సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హైకోర్టు అడ్వకేట్ జనరల్ ప్లీడర్(ఎ జి పి) హంసు వర్మ, వనపర్తి జిల్లా కోర్టు ఎ జి పి లు, అనంతరాజు,మునగారి కృష్ణ, జిల్లా కాంగ్రెస్ నాయకులు డిఎస్.మహేష్,డి.బుచ్చమ్మ, డి.రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# బిజినెస్

## వరుసగా మూడో ఏడాది డిష్ టీవీకి జరిమానా

**బిజినెస్**

ప్రముఖ డైరెక్ట్-టు-హౌమ్ (డీటీహెచ్) సేవల సంస్థ డిష్ టీవీ ఇండియాకు మరోసారి ఎదురుదెబ్బ తగిలింది. కంపెనీ బోర్డు కూర్పునకు సంబంధించిన నిబంధనలను పాటించడంలో విఫలమైనందుకు గాను, దేశంలోని ప్రముఖ స్టాక్ ఎక్స్ఛేంజీలు బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ), నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ)లు జరిమానా విధించాయి. ఈ వివాదం కారణంగా కంపెనీ జరిమానా ఎదుర్కోవడం ఇది వరుసగా మూడో ఏడాది. జూన్ 30తో ముగిసిన త్రైమాసికానికి గాను సెబీ లిస్టింగ్ నిబంధనలు 17(1), 19(1)/(2)లను ఉల్లంఘించినట్లు గుర్తించామని, ఈ మేరకు ఆగస్టు 29న నోటీసులు జారీ చేశామని ఎక్స్ఛేంజీలు తెలిపాయి. బీఎస్ఈ, ఎన్ఎస్ఈలు వేర్వేరుగా రూ. 5.69 లక్షల చొప్పున జరిమానా విధించాయి. 15 రోజుల్లోగా ఈ మొత్తాన్ని చెల్లించాలని ఆదేశించాయి. గతంలో 2023, 2024 సంవత్సరాల్లోనూ డిష్ టీవీ ఇదే కారణంతో జరిమానాలు ఎదుర్కొంది. ఈ జరిమానా చెల్లిస్తామని డిష్ టీవీ ఒక రెగ్యులేటరీ ఫైలింగ్‌లో పేర్కొంది. ఈ ఫైన్ వల్ల కంపెనీ ఆర్థిక, కార్యాచరణ కార్యకలాపాలపై ఎలాంటి ప్రభావం ఉండబోదని స్పష్టం చేసింది. వాటాదారులు డైరెక్టర్ల నియామకాలను ఆమోదించకపోవడం వల్లే బోర్డులో సభ్యుల సంఖ్య తగ్గిందని, ఇది యాజమాన్యం నియంత్రణలో లేని విషయమని కంపెనీ వివరణ ఇచ్చింది. గత కొన్నేళ్లుగా డిష్ టీవీలో ప్రమోటర్లు, వాటాదారుల మధ్య బోర్డు పునర్వ్యవస్థీకరణ విషయంలో తీవ్ర వివాదం కొనసాగుతోంది. సుభాష్ చంద్ర కుటుంబానికి చెందిన ప్రమోటర్ గ్రూప్‌కు, గతంలో అతిపెద్ద వాటాదారుగా ఉన్న యెస్ బ్యాంక్‌కు మధ్య ఈ విభేదాలు మొదలయ్యాయి. ప్రస్తుతం యెస్ బ్యాంక్ తన వాటాను జేసీ ఫ్లవర్స్ అసెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీకి విక్రయించినప్పటికీ, వివాదం సద్దుమణగలేదు. దీని ప్రభావంతోనే 2022లో మేనేజింగ్ డైరెక్టర్ నియామకంతో పాటు, రెండు ఆర్థిక సంవత్సరాల నివేదికలను కూడా వాటాదారులు తిరస్కరించిన విషయం తెలిసిందే

## ద్విచక్ర వాహనాలపై ఒకే తరహా జీఎస్టీ!

**బిజినెస్**

ద్విచక్ర వాహనాలపై ఒకే తరహా జీఎస్టీని విధించాలని లగ్జరీ బైకుల సంస్థ రాయల్ ఎన్‌ఫిల్డ్ కోరుతున్నది. జీఎస్టీ హేతబద్ధికరణలో భాగంగా అన్ని రకాల ద్విచక్ర వాహనాలపై 18 శాతం పన్నును విధించాలని సూచించింది. ప్రస్తుతం చిన్న స్థాయి బైకులపై 18 శాతం జీఎస్టీ విధిస్తుండగా, ప్రీమియం బైకులపై 28 శాతం జీఎస్టీతోపాటు పరిహారం సెస్‌ను 1 శాతం నుంచి 22 శాతం లోపు విధిస్తున్నారు. దీంతో ప్రీమియం బైకుల ధరలు అధికంగా ఉండటంతో కస్టమర్లు కొనుగోలు చేయడానికి ముందుకు రావడం లేదని, దీంతో కేంద్ర సర్కార్ జోక్యం చేసుకొని ఈ బైకులపై ఒకే తరహా జీఎస్టీని విధించాలని ఐచర్ మోటర్స్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సిద్ధార్థ లాల్ తెలిపారు.



350 సీసీ కంటే తక్కువ సామర్థ్యం కలిగిన బైకులపై తక్కువ జీఎస్టీని విధంచడంతో ఈ తరహా బైకులకు డిమాండ్ నెలకొంటుందని ఆశిస్తున్నట్టు, అలాగే ఆపై సామర్థ్యం కలిగిన బైకులపై అధికంగా వసూలు చేస్తే ఈ రంగ బైకుల విక్రయాలు పడిపోయే ప్రమాదం ఉందన్నారు.

## భగ్గుమంటున్న బంగారం ధర.. తులంపై భారీగా పెరిగిన పసిడి!

**బిజినెస్**

దేశంలో బంగారం, వెండి ధరలు భగ్గుమంటున్నాయి. రోజురోజుకు దూసుకుపోతున్నాయి. తగ్గినట్లే తగ్గి భారీగా పెరుగుతోంది. మన భారతీయ సాంప్రదాయంలో బంగారానికి ప్రత్యేక స్థానముంది. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యలలో బంగారం షాపులన్ని మహిళలతో కిటకిటలాడుతుంటాయి. నిన్న ఉదయంతో పోల్చుకుంటే ఈ రోజు అంటే ఆగస్ట్ 31న తులంపై భారీగా పెరిగింది. ఏకంగా 1640 రూపాయలకుపైగా ఎగబాకింది. ప్రస్తుతం దేశంలో బంగారం ధరలు ఎలా ఉన్నాయో తెలుసుకుందాం. ఇంకో విషయం ఏంటంటే ఈ ధరలు ఉదయం 6 గంటలకు నమోదైనవి మాత్రమే. రోజులో పెరగవచ్చు.. తగ్గవచ్చు.. లేదా స్థిరంగా కొనసాగవచ్చు.



హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,04,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,200 ఉంది.

ఢిల్లీలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,05,100 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,350 ఉంది.

ముంబైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,04,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,200 ఉంది.

బెంగళూరులో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,04,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,200 ఉంది.

చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,04,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,200 ఉంది.

కోల్‌కతాలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ. 1,04,950 ఉండగా, 22 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.96,200 ఉంది.

ఇక వెండి ధర కిలోకు రూ.1,21,000 ఉంది. ఇక హైదరాబాద్, కేరళ, చెన్నై రాష్ట్రాలలో మాత్రం కిలోకు రూ.1,31,000 ఉంది. ఇంటే ఇతర రాష్ట్రాలకంటే 10 వేల రూపాయలు ఎక్కువగా ఉంది.

# స్పోర్ట్స్

## ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్లతో విధ్వంసం.. ఫినిషర్‌గా రెచ్చిపోతున్న రింకూ..!

టీమిండియా స్టార్ రింకూ సింగ్ ఆసియా కప్ ముందు విధ్వంసక ఇన్నింగ్స్ ఆడాడు. మెగా టోర్నీలో తాను జట్టుకు ఫినిషర్‌గా ఎంతగా పనికొస్తానో చాటుతూ యూపీ టీ20 లీగ్‌లో బౌండరీల మోత మోగించాడు. తనదైన మెరుపు షాట్లతో అలరిస్తూ అర్ధ శతకంతో చెలరేగాడీ హిట్టర్. మూడు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన జట్టును ఆదుకున్న అతడు.. ఆకాశమే హద్దుగా విరుచుకుపడి ఒంటిచేత్తో గెలిపించాడు. రింకూ సుడిగాలి ఇన్నింగ్స్‌లో ఆరు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉండడం విశేషం. ఐపీఎల్‌తో పవర్ హిట్టర్ ట్యాగ్ సొంతం చేసుకున్న రింకూ సింగ్ యూపీ టీ20లో రెచ్చిపోయాడు. మీరుట్ మ్యావెరిక్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరిస్తున్న రింకూ తనదైన స్టయిల్లో చెలరేగి కాశీ రుద్రాస్ బౌలర్లకు చుక్కలు చూపించాడు. 136 పరుగుల ఛేదనలో 26కే మూడు వికెట్లు పడిన వేళలో క్రీజులోకి వచ్చిన ఈ లెఫ్ట్ హ్యాండర్ వీరకొట్టుడు కొట్టాడు. తొలి 20 బంతుల్లో ఏడు రన్స్ చేసిన రింకూ ఆ తర్వాత గేర్ మార్చాడు. స్వీప్ షాట్లు, ఆఫ్ సైడ్ బౌండరీలతో అలరించి అర్ధ శతకం సాధించాడు. ఆ తర్వాత కూడా అదే దూకుడు కొనసాగించి కేవలం 48 బంతుల్లోనే 4 ఫోర్లు, 4 సిక్సర్లతో 78 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును విజయ తీరాలకు చేర్చాడీ ఫినిషర్. అటల్ బిహారీ బౌలింగ్‌లో వరుసగా 6, 4, 6, 6 కొట్టడం మ్యాచ్‌కే హైలెట్. రింకూ విధ్వంసంతో మీరుట్ మ్యావెరిక్ 15.4 ఓవర్లలోనే లక్ష్యాన్ని చేరుకుంది. ఈ ఒక్క మ్యాచ్ అనేకాదు.. ఈ లీగ్‌లో రింకూ ధనాధన్ ఇన్నింగ్స్‌లతో హడలెత్తిస్తున్నాడు. ఇప్పటివరకూ ఏడు మ్యాచుల్లో ఈ స్టార్ బ్యాటర్ 107.52 స్ట్రయిక్ రేటుతో 295 రన్స్ సాధించాడు.






## 18 ఏళ్లకే మెరుపు సెంచరీ..

### విధ్వంసక ఆటతో చరిత్ర సృష్టించారిలా..!

పొట్టి క్రికెట్‌లో దంచికొట్టుడే మంత్రగా ఆడుతున్నారు ఈతరం బ్యాటర్లు. ఐపీఎల్ నుంచి కరీబియన్ ప్రీమియర్ లీగ్ వరకూ తమ విధ్వంసక ఆటతో శతకాలు బాదేస్తూ ఫ్యాన్స్‌కు పూనకాలు తెప్పిస్తున్నారు హిట్టర్లు. ఇంగ్లండ్ గడ్డ మీద జరుగుతున్న 'ది హండ్రెడ్ లీగ్'లోనూ సెంచరీల పర్వం లిఖిస్తున్నారు కొందరు. పురుషులకు దీటుగా ఆకాశమే హద్దుగా ఆడుతున్న మహిళా బ్యాటర్లు మూడంకెల స్కోర్‌తో రెచ్చిపోతున్నారు. వంద బంతుల ఈ లీగ్‌లో 'మేమూ రికార్డులు బ్రేక్ చేయగలం' అని చాటుతూ సెంచరీతో చరిత్ర సృష్టించారు ఈ ఇద్దరు. ఒకరు ఇంగ్లండ్ స్టార్ టమ్మీ బ్యూమంట్‌దీ కాగా.. మరొకరు ఆ దేశానికే చెందిన 18 ఏళ్ల డవినా పెర్రిన్. ఈ లీగ్ చరిత్రలో టాప్ -5 వేగవంతమైన శతకం బాదిన బ్యాటర్ల జాబితాలో ఈ ఇద్దరూ చోటు దక్కించుకోవడం విశేషం. ఈమధ్యే పాపులర్ అవుతున్న ది హండ్రెడ్ లీగ్‌లో సెంచరీల మోత మోగిస్తున్నారు బ్యాటర్లు. ఇంగ్లండ్ పరిమిత ఓవర్ల కెప్టెన్ హ్యారీ బ్రూక్ నార్తర్న్ సూపర్ చార్జర్స్ తరఫున 41 బంతుల్లోనే వంద కొట్టి రికార్డు నెలకొల్పగా.. డవీనా పెర్రిన్ బౌలర్లను ఊచకోత కోస్తూ శతకంతో చెలరేగింది. నార్తర్న్ సూపర్‌చార్జర్స్‌కు ఆడుతున్న ఈ యువ బ్యాటర్ ఎలిమినేటర్ పోరుతో సివంగిలా పంజా విసిరి 42 బంతుల్లోనే సెంచరీకి చేరువైంది. తద్వారా మహిళల ది హండ్రెడ్ లీగ్‌లో ఫాస్టెస్ట్ సెంచరీ నమోదు చేసిందీ డేరింగ్ హిట్టర్. పెర్రిన్ కంటే ముందు టమ్మీ బ్యూమంట్ ఈ లీగ్‌లో వంద కొట్టింది. రెండేళ్ల క్రితం 'ది వెల్ష్ ఫైర్' జట్టు తరఫున ఈ రైట్ హ్యాండర్ 52 బంతుల్లో శతక గర్జన చేసి.. తొలి సెంచూరియన్‌గా రికార్డు పుస్తకాల్లో చేరింది. కానీ.. ఐదో సీజన్‌లో పెర్రిన్ ఆమె రికార్డును బద్ధలు కొడుతూ వేగవంతమైన శతకంతో సరికొత్త చరిత్ర లిఖించింది. ఇప్పటివరకైతే మహిళల ది హండ్రెడ్ లీగ్‌లో సెంచరీ బాదింది ఈ ఇద్దరు మాత్రమే.



**టాప్ -5 సెంచరీలు..!**

పురుషుల, మహిళల ది హండ్రెడ్ లీగ్ చరిత్రలో ఫాస్టెస్ట్ సెంచరీ కొట్టింది ఎవరంటే..హ్యారీ బ్రూక్ (నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్) -41 బంతుల్లో, డవీనా పెర్రిన్ (నార్తర్న్ సూపర్‌ఛార్జర్స్) - 42 బంతుల్లో, విల్ జాక్స్(ఓవల్ ఇన్విసిబుల్స్) - 47 బంతుల్లో, విల్ స్మీడ్ (బర్మింగ్‌హమ్ ఫీనిక్స్) - 49 బంతుల్లో, టమ్మీ బ్యూమంట్(ది వెల్ష్ ఫైర్)- 52 బంతుల్లో వంద కొట్టేశారు.

## ఉత్కంఠ పోరులో జపాన్‌పై విజయం..

### సూపర్ 4కు చేరువైన టీమిండియా




స్వదేశంలో జరుగుతున్న హాకీ ఆసియా కప్ లో భారత జట్టు జోరు కొనసాగిస్తోంది. తొలి పోరులో చైనాను చిత్తు చేసిన టీమిండియా ఈసారి జపాన్‌కు చెక్ పెట్టింది. ఆదివారం ఉత్కంఠగా సాగిన మ్యాచ్‌లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్, మన్దీప్ సింగ్ అద్భుతంగా రాణించడంతో 3-2తో గెలుపొందింది. వరుసగా రెండు విజయాలతో భారత్ సూపర్ 4కు చేరువైంది. గ్రూప్ ఏలో అగ్రస్థానంలో ఉన్న హర్మన్‌ప్రీత్ సేన సోమవారం కజకిస్థాన్‌తో తలపడనుంది. ఆరంభ మ్యాచ్‌లో చైనాపై గెలిచినా.. మెరుగైన ప్రదర్శన చేయలేదు భారత ఆటగాళ్లు జపాన్‌పై మాత్రం టాప్ గేర్‌లో ఆడారు. ఆట మొదలైన నాలుగో నిమిషంలోనే మనుదీప్ సింగ్ తొలి గోల్ అందించాడు. ఆ తర్వాతి 60 సెకన్లలోనే కెప్టెన్ హర్మన్‌ప్రీత్ పెనాల్టీ కార్నర్‌ను గోల్‌గా మలిచాడు. మూడో అర్ధ భాగంలో జపాన్ గోల్‌తో ఖాతా తెరిచింది. అయితే.. మరోసారి సారథి హర్మన్‌ప్రీత్ గోల్ చేయగా భారత్ 3-1తో స్పష్టమైన ఆధిక్యంలోకి వెళ్లింది. మరికాసేపట్లో ఆట ముగుస్తుందనగా జపాన్ గోల్ చేసినా ఫలితం లేకపోయింది. ప్రత్యర్థి ఆటగాళ్లు మరో గోల్‌కు ప్రయత్నించినా.. ఢిఫెండర్లు అద్భుతంగా రాణించి వాళ్లకు చెక్ పెట్టారు.



# మరో హారర్ జానర్ చిత్రంలో నేషనల్ క్రష్..

నేషనల్ క్రష్ రష్మిక మందన్నా దక్షిణాదితోపాటు బాలీవుడ్‌లోనూ బిజీగా ఉంది. ఇటీవలే 'కుబేర' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది బెంగళూరు బ్యూటీ. ఈ దీపావళికి 'థామా' తో అలరించడానికి సిద్ధమవుతోంది. ఆయుష్మాన్ ఖురానాతో ఆమె నటించిన హారర్ లవ్‌స్టోరీ ఇది. అక్టోబరు 21న ప్రేక్షకుల ముందుకురానుంది. తాజా సమచారం ప్రకారం రష్మిక హిట్ హారర్ ఫ్రాంచైజీల చిత్ర విషయంలోనూ రష్మిక పేరు వినిపిస్తోంది.కాంచన' సిరీస్ సినిమాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన రాఘవ లారెన్స్.. ప్రస్తుతం 'కాంచన 4' తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే! లారెన్స్ హీరోగా నటిస్తూ.. తెరకెక్కిస్తున్న చిత్రం. ప్రస్తుతం చిత్రీకరణ దశలో ఉంది. ఇందులో పూజా హెగ్డే, నోరా ఫతేహి ప్రధాన పాత్రధారులుగా నటిస్తున్నారు. ఇప్పుడు ఈ చిత్రంలో రష్మికను ఓ ప్రత్యేక పాత్ర కోసం చిత్ర బృందం సంప్రదించారని తెలిసింది. ఇప్పటికే చర్చలు కూడా పూర్తయ్యాయట. ప్రస్తుతం రష్మిక నటించిన తెలుగు సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్' కూడా విడుదలకు సిద్ధమవుతుంది.




# ఉస్తాద్ భగత్ సింగ్ నుండి అదిరిపోయే పోస్టర్..
## ఇక జాతర మొదలు


మొన్నటి వరకు రాజకీయాలతో బిజీ బిజీగా ఉన్న పవన్ కళ్యాణ్ తాను కమిటైన ప్రాజెక్ట్‌లకి బ్రేక్ వేశాడు. ఇటీవల ఒక్కొక్కటి పూర్తి చేస్తూ దూసుకుపోతున్నాడు. హరిహర వీరమల్లు చిత్రం కొద్ది రోజుల క్రితం విడుదల కాగా, ఈ మూవీ అభిమానులని కూడా ఏ మాత్రం అలరించలేకపోయింది. ఇక ఓజీ చిత్రం సెప్టెంబర్ 25న విడుదల కానుంది. ఈ మూవీ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమాల క్రేజ్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆయన ఏ ప్రాజెక్ట్ ప్రకటించినా అది అభిమానులకే కాదు, టాలీవుడ్ మొత్తానికి ఉత్సాహాన్ని కలిగిస్తుందన్న విషయంలో సందేహం లేదు. ఇప్పుడు అదే స్థాయిలో హైప్ తెచ్చుకుంటున్న సినిమా "ఉస్తాద్ భగత్ సింగ్".ఈ చిత్రానికి హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఒకప్పుడు గబ్బర్ సింగ్ వంటి బ్లాక్‌బస్టర్ హిట్ ఇచ్చిన ఈ కాంబో మళ్లీ కలిసి వస్తుండటంతో అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఫ్యాన్స్ అయితే ఈ సినిమాను ఒక పండుగలా భావిస్తున్నారు. సెప్టెంబర్ 2న పవన్ కళ్యాణ్ పుట్టినరోజు. ప్రతి సంవత్సరం లాగే ఈసారి కూడా ఫ్యాన్స్ ముందుగానే పండుగను స్టార్ట్ చేశారు. కటౌట్లు, ఫ్లెక్సీలు, బ్లడ్ డొనేషన్లు, సోషల్ సర్వీస్ కార్యక్రమాలు మొదలైపోయాయి. ఈ వేడుకలో మేకర్స్ కూడా భాగమవుతూ, ఒకటి తర్వాత ఒకటి సర్ప్రైజ్ గిఫ్ట్ ఇస్తున్నారు. తాజాగా విడుదల చేసిన ప్రీ-లుక్ పోస్టర్ ఈ జోష్‌కు మరింత బలాన్నిచ్చింది. ఈ పోస్టర్‌లో పవన్ కళ్యాణ్ ఒక సాంగ్ షూట్ లుక్‌లో కనిపించగా, ఆయన వింటేజ్ మాస్ స్టైల్, ఎనర్జీ ఫ్యాన్స్‌ను ఫుల్ ఖుషీ చేసింది.

# దుబాయ్ బిజినెస్‌మెన్ ప్రేమలో ఈ యంగ్ బ్యూటీ ఎలా పడిందంటే..!

టాలీవుడ్ బ్యూటీ నివేదా పేతురాజ్ రీసెంట్‌గా తన ప్రేమ విషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వినాయక చవితి పండుగను పురస్కరించుకుని, దుబాయ్‌కు చెందిన వ్యాపారవేత్త రజిత్ ఇబ్రాన్‌తో రిలేషన్‌లో ఉన్నానని సోషల్ మీడియా ద్వారా వెల్లడించింది. ఈ ప్రకటనా అనంతరం సినీ ప్రముఖులు, అభిమానులు ఆమెకు శు భాకాంక్షలు తెలుపుతున్నారు. అయితే నివేదా తాజాగా తన ప్రేమాయణంకి సంబంధించిన ఆసక్తికర విషయాలు వెల్లడించింది. ఐదేళ్ల క్రితం దుబాయ్‌లో నిర్వహించిన ఓ రేసింగ్ ఈవెంట్‌లో రజిత్‌ను మొదటిసారి కలిశాను. మొదట మేము మంచి స్నేహితులుగా ప్రారంభించాము. ఆపై సమయం గడుస్తూ అభిప్రాయాలు కలవడం, మనసులు దగ్గర కావడంతో ప్రేమలో పడిపోయాము.మా రిలేషన్ గురించి చాలా తక్కువ మందికే తెలుసు. ఇండస్ట్రీలో కూడా ఈ విషయం ఎవరికీ తెలియదు. ఇప్పుడు అకస్మాత్తుగా ఈ విషయాన్ని బయటపెట్టడంతో నా మేనేజర్ కూడా షాక్ అయ్యాడు అని చెప్పింది. ఈ ఏడాది అక్టోబర్‌లో మేం ఎంగేజ్‌మెంట్ చేసుకోబోతున్నాం. పెళ్లి జనవరిలో ప్లాన్ చేస్తున్నాం. తుది తేదీ ఇంకా ఫిక్స్ కాలేదు కానీ, పెళ్లి పనులు మొదలుపెట్టేశాం. మా ఇరు కుటుంబాలు ప్రస్తుతం దుబాయ్‌లో ఉన్నాయి. మేము సింపుల్‌గా, కుటుంబ సభ్యులు, సన్నిహితుల మధ్య పెళ్లిని జరుపుకుంటాం అని నివేదా వివరించింది.మధురైలో జన్మించి పెరిగిన నివేదా, 'మెంటల్ మదిలో' సినిమాతో తెలుగు ఇండస్ట్రీలో హీరోయిన్‌గా అడుగుపెట్టింది. అనంతరం 'చిత్రలహరి', 'బ్రోచేవారేవరురా', 'అల వైకుంఠపురములో', 'రెడ్', 'పాగల్', 'విరాటపర్వం', 'దాస్ కా ధమ్కీ' వంటి సినిమాల్లో నటించింది. సినిమాల పరంగా టాలెంట్ ఉన్నప్పటికీ, ప్రస్తుతం ఆమె చేతిలో కొత్త ప్రాజెక్టులు లేనట్లు తెలుస్తోంది. కార్ రేసింగ్, బ్యాడ్మింటన్ వంటి క్రీడల్లోనూ ఆమె ప్రత్యేక ఆసక్తి కలిగి ఉంది. ఇకపై ఆమె వ్యక్తిగత జీవితం కొత్త అధ్యాయానికి తెరలేవనుంది. పెళ్లి తర్వాత నివేదా సినిమాలు చేస్తుందా లేదా అనేది చూడాలి.



# టాలీవుడ్‌లో దూసుకుపోతున్న మలయాళం సినిమా 'కొత్త లోక'



ఇటీవల థియేటర్లలో విడుదలైన మలయాళ చిత్రం 'కొత్త లోక' తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకోవడమే కాకుండా బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. మలయాళంలో సూపర్ హిట్ అయిన ఈ చిత్రం తెలుగులో కొంత ఆలస్యంగా, పలు సమస్యల మధ్య విడుదలైనప్పటికీ, అద్భుతమైన స్పందన పొందింది. ఈ సినిమాలో కల్యాణి ప్రియదర్శన్ ప్రధాన పాత్రలో నటించగా 'ప్రేమలు' ఫేమ్ నటుడు నస్లెన్ కీలక పాత్రలో మెప్పించారు.వీకెండ్ రావడంతో 'కొత్త లోక' తెలుగులో మంచి ఓపెనింగ్స్ సాధించినట్లు ట్రేడ్ వర్గాలు వెల్లడించాయి. మొదటి రోజు, (శనివారం) తెలుగు రాష్ట్రాల నుంచి ఈ చిత్రం ఒక కోటి రూపాయలకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు సమాచారం. పెద్దగా ప్రచారం, బజ్ లేకుండానే ఈ స్థాయిలో కలెక్షన్స్ రాబట్టడం విశేషం. ఈ సినిమాకు డామినిక్ అరుణ్ దర్శకత్వం వహించగా, తెలుగులో నాగవంశీ సమర్పణలో విడుదలైంది. తెలుగు ప్రేక్షకులు కూడా ఈ సూపర్ హీరో చిత్రానికి మంచి మార్కులు వేయడంతో, రాబోయే రోజుల్లో మరిన్ని కలెక్షన్స్ సాధించే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

# 'స్పిరిట్' కోసం ప్రభాస్ సరికొత్త లుక్.. రంగంలోకి ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్.!




టాలీవుడ్ నటుడు, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ ప్రస్తుతం 'ది రాజాసాబ్', 'ఫౌజీ' సినిమాలతో బిజీగా ఉన్న విషయం తెలిసిందే. ఈ రెండు సినిమాలను తొందరగా కంప్లీట్ చేసుకుని త్వరలోనే సందీప్ రెడ్డి వంగతో స్పిరిట్ అనే సినిమా చేయబోతున్నాడు. ఈ చిత్రంలో యానిమల్ ఫేం తృప్తి డిమ్రి హీరోయిన్‌గా నటిస్తుండగా.. భద్రకాళి పిక్చర్స్, టీ సిరీస్‌తో కలిసి సంయుక్తంగా తెరకక్కిస్తున్న ఈ చిత్రానికి హర్షవర్ధన్ రాణే సంగీతం అందిస్తున్నాడు.ఈ చిత్రంలో ప్రభాస్ పవర్ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతుండటంతో అభిమానుల్లో ఈ సినిమాపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే ఈ సినిమాలో ప్రభాస్ లుక్స్ ఎలా ఉండబోతున్నాయో అనే ఆసక్తి అందరిలోనూ నెలకొన్న విషయం తెలిసిందే. తాజాగా దీనికి సంబంధించి ఒక సాలిడ్ న్యూస్ బయటకి వచ్చింది. ఈ సినిమాలో ప్రభాస్ లుక్స్ కోసం ప్రముఖ హెయిర్ స్టైలిస్ట్ ఆలిమ్ హకీమ్ పనిచేయబోతున్నట్లు తెలుస్తుంది. సందీప్ రెడ్డి వంగా గత చిత్రాల హీరోలకు కూడా ఆలిమ్ హకీమ్ లుక్స్ డిజైన్ చేశారు. దీంతో ఈసారి ప్రభాస్‌ను సరికొత్త లుక్‌లో ఎలా చూపిస్తారా అని అభిమానులు ఉత్సాహంగా ఎదురుచూస్తున్నారు. కాగా దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

Printed,Published by,Owened by **GADDAM NAGARAJU &** Printed at ,arun publication ,HNO 51/1 indhiramma colony,phase 1,nizampet, Hyderabad **RNI. NO TELTEL/2022/83463 &** Published at .HNO 3-123shivanagar colony,Ellanda, Wardhannapet, warangal 506313.. telangana
**EDITOR : GADDAM NAGARAJU . CELL :9494923460 . Website : WWW.tharangalu.com Email : nagarajugaddam009@gmail.com**